


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : **సద్గురు శ్రీ నాన్నగారు**





**సంపుటి : 11** **సంచిక : 8** **ఏప్రిల్ 2006**

**రమణ భాస్కర**
ఆధ్యాత్మిక మాస పత్రిక
**పేజీలు : 32**
గౌరవ సంపాదకులు
శ్రీమతి **P.H.V. సత్యవతి (హైమ)**

**చందా**
సంవత్సర చందా:రూ॥100/-
విడి ప్రతి : రూ॥ 5/-

చిరునామా
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


**ఈ సంచికలో....**


కాపవరం .......... 23-12-05
గణపవరం ......... 20-02-06
ఉందుర్రు ........... 10-02-06
చించినాడ ..... 09-03-06



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858


## ఆత్మజ్ఞానానికి గృహస్థుకూడా అర్హుడే

అందరూ సన్యాసులు కాలేరు. కావలసిన అవసరం కూడా లేదు. సన్యాసి అవటం చాలా కఠోరమైన దీక్ష. ఏ కొద్దిమందికోగాని ఆ మార్గానపోయే అర్హత ఏర్పడదు. గృహస్థునికి విముక్తి మార్గాన్ని బోధించటం సన్యాసధర్మం. పుణ్యపురుషులను, యోగులను ఆహ్వానించి, ఆతిధ్యమిచ్చి, ఆదరించేది గృహస్థ ధర్మం. యోగికి అన్నదానం చేసి ఆదరించిన వానికి, ఆ మహనీయుడు సంపాదించుకొన్న తపస్సు పుణ్యఫలంలో కొంతభాగం లభిస్తుంది. తనకు విధించబడిన విహిత కర్మలను నిష్కామంగా ఆచరించే గృహస్థునికి ఆత్మజ్ఞానం వలన కలిగే ఆనందము, పరమశాంతి సొంతమవుతాయి. ప్రాపంచిక సుఖాలను అనుభవించే గృహస్థు ఆత్మజ్ఞానానికి పనికిరాడని, ఆధ్యాత్మిక చింతన చేయలేడని అనుకోవటం పొరపాటు. తానెవరో? అని తరిచి విచారణ చేసేవాడు, భౌతిక వాంఛలు వృధా అని గ్రహించిన వాడు గృహస్థు అయినా తప్పక ఆత్మజ్ఞానాన్ని పొందుతాడు. గృహస్థులలో గాంధీ మహాత్ముడులాగ, చక్రవర్తులలో జనకమహారాజులాగా, జీవన్ముక్తులయిన గొప్ప కర్మయోగులున్నారు. మహాభారతంలో ధర్మవ్యాధుడు, తులాధారుడు, వంటి మహనీయులు కనిపిస్తారు. వీరందరూ గృహస్థులే అయినా గొప్ప ఆత్మజ్ఞానా సంపన్నులై యతులకు, తపస్సంపన్నులయిన మునులకు ఆత్మవిద్యను బోధించినవారు. జీవుడు తనలోని పశుత్వాన్ని అదుపులో ఉంచుకొని, మానవత్వాన్ని పెంచుకొని, తన నిజ స్వరూపాన్ని గ్రహించితే ఏ ఆశ్రమవాసి అయినా తప్పక జీవన్ముక్తుడవుతాడు. ఆధ్యాత్మిక విషయాలలో స్వేచ్ఛగా ఆలోచించాలి. ఒకే సత్యాన్ని పలువురు పలురకాలుగా గ్రహిస్తారు. తన మనస్సును ఎట్లా వినియోగించుకుంటాడు అన్నదే కీలకం.

**- బొప్పన అరుణాదేవి**

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-12-05, కాపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడిచేత గానం చేయబడినది భగవద్గీత. దానితో సమానమైన గ్రంథం ఏదీ లేదు. భగవద్గీత మన దగ్గర ఉంటే సమస్త శాస్త్రములు మన దగ్గర ఉన్నట్లే. భగవద్గీత ప్రచారం చాలా ముఖ్యం. ఓ అర్జునా! నీకు నాకు జరిగినటువంటి ఈ సంభాషణను, ఈ యోగశాస్త్రాన్ని ఎవరైతే అధ్యయనంచేసి, అర్థంచేసుకొని, అనుభవంలోనికి తెచ్చుకొని ప్రేమతో, భక్తితో, ఇష్టంతో ఇతరులకు బోధిస్తున్నారో వారు నాకు అత్యంత ప్రీతిపాత్రులు, వారికంటే ఇష్టులు ఈ సృష్టిలో నాకు ఎవరూ లేరు అని పరమాత్మ చెప్పాడు. ఎక్కడైనా గుడి కట్టించ మంటే కోటి రూపాయలు ఖర్చుపెడతారు. మీరు గుడి కట్టించనక్కరలేదు, గోపురం కట్టించ నక్కరలేదు ఒక గంట కూర్చొని శ్రద్ధగా సబ్జక్టు శ్రవణం చేయండి అంటే ఓపిక ఉన్నవారు ఎవరూ కనబడటం లేదు. కాళ్ళకు పని చెప్తారు, చేతులకు పని చెప్తారు కాని మెదడుకు పని చెప్పేవారు చాలా తక్కువ మంది ఉన్నారు. మీరు త్రికరణశుద్ధిగా ఏ మార్గంలో ప్రయాణం చేసినా నన్నే పొందుతారు అని పరమాత్మ చెపుతున్నాడు. ఇందులో ఒక మార్గం ఎక్కువ కాదు, ఒక మార్గం తక్కువ కాదు. మీకు తేలికగా ఉన్న మార్గంలో, మీ మనస్సుకు నచ్చిన మార్గంలో ప్రయాణించి తరించండి. అంతేగాని ఈ మార్గంలో వెళ్ళేవారు మాత్రమే బాగు పడతారు, ఇంకో మార్గంలో వెళితే బాగుపడరు అని ఎవరైనా చెపుతూ ఉంటే అటువంటి మాటలు నమ్మవద్దు. ఉన్నవస్తువు ఒక్కటే, అదే బ్రహ్మం. దానికే దేవతాబుద్ధి కల్పించి ఏదో ఒక దేవతారూపంలో ఆ వస్తువును ఆరాధిస్తున్నాము. ఎందుచేతనంటే రూపం లేనిదాని మీద, నామం లేనిదాని మీద మీరు మనస్సు నిలబెట్టలేరు. అందుచేత ఏదో రూపాన్ని, ఏదో నామాన్ని పట్టుకొని ఆరాధిస్తున్నాము. మీరు ఏ రూపాన్ని ఆరాధించినా, ఏ నామాన్ని స్మరించినా ఆ వస్తువునే చేరుకొంటారు. గీతను గురుముఖతః శ్రవణం చేస్తే దాని వైభవం మనకు తెలుస్తుంది. మీకు ఎవరికైనా దుఃఖం ఉంటే దానిని పోగొట్టటానికి భగవద్గీతలో ఒక్క శ్లోకం చాలు. మీకు ఏ రకమైన సందేహాలు ఉన్నా వాటిని పోగొట్టగల గ్రంథం గీత ఒక్కటి మాత్రమే. భగవంతుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన మన బాహ్య జీవితాన్ని చూడడు, లోపల ఎలా ఉన్నారో చూస్తాడు. మీరు ఒక మాట మాట్లాడుతూ ఉంటే ఆ మాటను చూడడు, మీరు ఏ ఉద్దేశ్యంతో ఆ మాట మాట్లాడుతున్నారు అని చూస్తాడు. మీ తలంపును చూస్తాడు. ఆయన కేవలం మీ బాహ్య జీవితాన్ని చూడడు, లోపల జీవితాన్ని

చూస్తాడు, వాడే నారాయణుడు.

మనం ట్రయినింగ్ పొందటానికి ఈ భూమి మీదకు వచ్చాము. అందుచేత ట్రయినింగ్ పూర్తిచేసుకొని ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవాలి. శరీరం పుడుతుంది, మరణిస్తుంది. నీవు ఎవరో నీకు తెలియటం లేదు కాబట్టి, నీవు ఏదిగా ఉన్నావో దాని తాలుక అనుభవం నీకు లేదు కాబట్టి ఈ శరీరమే నువ్వు అనుకొంటున్నావు. ఈ మనస్సే నువ్వు అనుకొంటున్నావు. వీటి అన్నింటికి అతీతమైన వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. అది సుఖస్వరూపం, ఆనందస్వరూపం, జ్ఞానస్వరూపం. అది నీవై ఉన్నావు. మీరు ఆత్మ జ్ఞానాన్ని పొందండి. అన్ని విద్యలకు రాజు ఆత్మవిద్య. ఆత్మజ్ఞానం వలన మాత్రమే ఆత్మ తెలియబడుతుంది. శ్రద్ధ కలవాడికి మాత్రమే జ్ఞానం కలుగుతుంది. అందుచేత మనం శ్రద్ధగా సద్గ్రంథం శ్రవణం చేయాలి. డబ్బు ఖర్చుపెట్టి ఏదైనా పనిచేయమంటే చేస్తాము కాని శ్రద్ధగా శ్రవణం చేయండి అంటే శ్రవణం చేసే అలవాటు మనకు లేదు. ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం అలవర్చుకోవాలి. గురువుకు ఎంతో కొంత శుశ్రూష చేయాలి, నువ్వు దేనినైతే పొందాలి అనుకొంటున్నావో దానికోసం జీవించటం నేర్చుకోవాలి. గురువు పట్ల విశ్వాసం ఉండాలి, నీవు ప్రేమతో, ఇష్టంతో ప్రయత్నం చేయాలి. నువ్వు ఇన్ని గుణాలతో ప్రయత్నం చేస్తూఉంటే జ్ఞాన సముపార్జనకు అర్హత కలుగుతుంది, అప్పుడు శాంతి, ఆనందం పొంగివచ్చి నీ సహస్రారాన్ని ముంచుతుంది. నిప్పు మీద నీరు పోస్తే వెంటనే ఎలా చల్లారిపోతుందో అలాగ ఆనందం, శాంతి వచ్చి నీ సహస్రారాన్ని ముంచటం, నీవు అమృతత్వం పొందటం, జననమరణ చక్రం నుండి విడుదలపొందటం అంతా ఒకేసారి జరిగిపోతుంది. ఈ సృష్టిలో అన్నింటికంటే నీచమైనది భయం. ఈశ్వరుడు మన హృదయంలో ఉన్నాడు కాని భయం వలన మనం ఆ లోయలలోనికి వెళ్లలేకపోతున్నాము. కొంతమందికి మంచి పనులు చేయాలని ఉంటుంది, మంచి మాట్లాడాలని ఉంటుంది కాని భయం వలన చెయ్యలేరు. మనిషికి ధైర్యం అవసరం. ధైర్యం లేకపోతే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం రాదు. నువ్వు లోకాన్ని చూసి జడిస్తే లోకం నిన్ను తరుముకొస్తుంది. నువ్వు లోకాన్ని చూసి భయపడవనుకో లోకం నిన్ను చేసేది ఏమీ లేదు.

భౌతిక జీవితం వేరు, ఆధ్యాత్మిక జీవితం వేరు అని చాలామంది అనుకొంటున్నారు. నీ భౌతిక జీవితం సరిగ్గా లేకపోతే ఆధ్యాత్మికజీవితం ఏమీ ఉండదు. ఈ భౌతికజీవితాన్ని ఎప్పటికప్పుడు సరిచేసుకొంటూ నీవు ఎరుకతో జీవిస్తూ ఉంటే నీకు ఆత్మజ్ఞానం అందుతుంది.

ఈ లోకాలు అన్నీ ఉన్నమాట నిజమే కాని, ఇవి అన్నీ చైతన్యం నందు కల్పితములే. ట్రైనింగ్ అవ్వటానికి ఈ భూమి మీదకు వచ్చాము అన్న సంగతి మర్చిపోవద్దు. మాకు శాంతి అందటం లేదు అని కొంతమంది అంటూఉంటారు. మీకు ఎప్పుడైతే ఆత్మజ్ఞానం కలిగిందో ఒక్క క్షణం కూడా ఆగదు, శీఘ్రంగా మీకు శాంతి వచ్చేస్తుంది. నదికి గండిపడినప్పుడు నీరు ఎంత వేగంగా వస్తుందో నీకు ఆత్మానుభవం కలిగినప్పుడు అంత వేగంగా శాంతి వచ్చేస్తుంది, పరమాత్మ ఏమి చెపుతున్నారు అంటే నీ దేహం కూడా నీడ వస్తుంది, ఆ నీడను కొంతమంది పూజించవచ్చు, కొంతమంది విమర్శించవచ్చు కాని ఆ నీడను నీవు పట్టించుకోవు. పూర్వ జన్మలో చేసిన కర్మను బట్టి ఈ దేహం సిద్ధమయింది. ఆ ప్రారబ్దం ఎంత కాలం ఉంటుందో అంతకాలం ఈ దేహం భూమి మీద తిరుగుతుంది, తరువాత దేహం చనిపోతుంది. దేహం నువ్వు కాదు అది ప్రారబ్దాన్ని బట్టి వచ్చింది. ఈ దేహానికి కొంతమంది సన్మానాలు చేయవచ్చు, కొంతమంది అవమానాలు చేయవచ్చు. నీ దేహం యొక్క నీడను ఎలా పట్టించుకోవటం లేదో అలాగే ఈ దేహానికి సంబంధించిన గౌరవాలను, అగౌరవాలను పట్టించుకోవద్దు. ఇదంతా నువ్వు కాదు, నీ నీడను నువ్వు ఎలా పట్టించుకోవటం లేదో అలాగ దేహం యొక్క ప్రారబ్ధాన్ని కూడా పట్టించుకోకువయ్యా, అప్పుడు కదా నీకు అంతర్దృష్టి కలిగేది అంటున్నాడు పరమాత్మ. నదిలోని నీరు సముద్రంలో కలవటం వలన సముద్రానికి లాభం లేదు, నదిలోని నీరు కలవకపోవటం వలన దానికి నష్టం లేదు, అది ఒకేలాగ ఉంటుంది. నిన్ను అదృష్టం వెంటాడినా, దురదృష్టం వెంటాడినా ఆ సముద్రం ఎంత గంభీరంగా ఉందో నువ్వు కూడా అంత గంభీరంగా ఉంటేకదా నీకు ఆత్మజ్ఞానం కలిగేది, నీ హృదయంలో ఉన్న శాంతి నీ చేతికి అందేది అంటున్నాడు పరమాత్మ. మన బుద్ధి మంచిది కాదు కాబట్టి గీతలో చెప్పిన మాటలు మనకు నచ్చటం లేదు. అందుకే నీ పాడుబుద్ధికి గీత అర్థం కాదు అని పరమాత్మ చెప్పాడు. నీ ఇష్టాలను, అయిష్టాలను ఒక ప్రక్కనపెట్టి నాకు ఇష్టమైన పనులు చేస్తూ నేను ఎలా జీవించమని చెప్పానో అలాగ జీవిస్తూ ఉంటే, నీ మనస్సు ఎటు గంతులు వేయమంటే అటు గంతులు వేయకుండా శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటే నా అనుగ్రహానికి పాత్రుడవు అవుతావు అని పరమాత్మ చెపుతున్నాడు. ఎవడైతే ఈశ్వరుడి దయకు పాత్రుడయ్యాడో వాడికి మాత్రమే ఈశ్వరుడు ఎరుకలోనికి వస్తాడు.

కొంతమందికి అన్నీ ఉంటాయి కాని ఎప్పుడూ ఏడుస్తూ ఉంటారు. లోపల ఉన్న చైతన్యాన్ని కొంతమంది శరీరంగా చూస్తున్నారు, కొంతమంది మనస్సుగా చూస్తున్నారు.

అందరి హృదయాలలో ఉన్న చైతన్యాన్ని ఉన్నది ఉన్నట్లుగా ఎవడైతే దర్శించలేడో వాడు ఈ జన్మలోనే కాదు రాబోయే జన్మలో కూడా వాడిని వాడు హింసపెట్టుకొంటూ ఉంటాడు, ఏడుపు మొఖం వేసుకొని తిరుగుతూ ఉంటాడు. వాడికి ఎంత డబ్బు ఉన్నా చైతన్యాన్ని ఒక మనస్సుగా చూసినప్పడు, ఒక శరీరంగా చూసినప్పడు చావటం తప్పదు, తిరిగి పుట్టటం తప్పదు, శరీరానికి మరణం వస్తే నేను చనిపోతున్నాను అనుకొంటాడు, మనస్సులో బెంగవస్తే నాకు బెంగ వచ్చింది అనుకొంటాడు. చైతన్యం తాలుక ఎరుక నీకు లేదు కాబట్టి ఇలా ఏడుస్తూనే ఉంటావు, ఇదే సంసారం, ఇదే అజ్ఞానం. అజ్ఞానం అనేది ఒక పదార్థం కాదు, లోపల ఉన్న వస్తువును ఉన్నది ఉన్నట్లుగా గ్రహించలేకపోవటమే అజ్ఞానం, దాని తాలుక ఎరుక లేకపోవటమే అజ్ఞానం. నీ మనస్సుకు సంబంధించిన గొడవలు, దేహానికి సంబంధించిన గొడవలు అన్నీ చైతన్యంలో ఉన్నాయని భ్రాంతి పడుతున్నావు. ఆ భ్రాంతి వలన అందరి హృదయాలలో ఉన్న ఈశ్వరుడిని దర్శించలేకపోతున్నావు. ఇలా ఎంతకాలం అయితే ఉన్న వస్తువును ఉన్నట్లుగా దర్శించలేవో అంతకాలం నీకు వేదన తప్పదు, రోదన తప్పదు, నిన్ను నీవు హింసపెట్టుకోవటం మానవు. కొంతమంది ఇతరులను హింస పెట్టకపోయినా వారిని వారు హింసపెట్టుకొంటూ ఉంటారు. వారిని వారు హింసించుకోవటం కూడా పాపం అన్న సంగతి వారికి తెలియటం లేదు, వారి లోపల ఉన్నవాడు కూడా ఈశ్వరుని అంశే అది వారికి తెలియటం లేదు. ఇంట్లోని వారు అందరూ వారిని ప్రేమగా చూద్దాము అనుకొన్నా ఆ ప్రేమ తాలుక, శాంతి తాలుక వైభవాన్ని వారు అందుకోలేరు. మన శరీరానికి ఏదైనా రోగం వచ్చింది అనుకోండి, ఒకరోజు ఏదో టేబ్లెట్ వాడితే తగ్గిపోదు. కొన్ని రోజులు మందులు వాడాలి, పత్యం చేయాలి. ఇన్ని రకాలుగా కష్టపడితేనేగాని మన శరీరానికి వచ్చిన రోగమే తగ్గటం లేదు. ఇక అనేకజన్మల నుండి మోసుకొస్తున్న వాసనలు ఒక్కరోజు సాధన చేస్తే నీకు పోతాయా? అంటున్నారు రామకృష్ణుడు. రామకృష్ణుడు, రమణుడు వారి అనుభవంలోనుండి తీసి అమృతాన్ని మనకు పంచి పెట్టారు. ఏవో మాటలు చెప్పటంకాదు, మనం తరించాలని ప్రేమతో నిండు హృదయంతో చెప్పిన అమృతవాక్యాలు, మనలను మరణ రహితస్థితికి తీసుకొని పోవటానికి మనలను ప్రేమించి, ప్రేమించి మనలను తరింపచేయాలని వారి జీవితాలను త్యాగం చేసారు. శరీరం మరణించినప్పడు శరీరం ఇక్కడే దహనం అయిపోతుంది. కాని ఈ శరీరం లోపల ఉన్న జీవుడు వాసనలను మోసుకొనిపోతాడు, వాడు స్మశానంలో దహనం అవ్వడు, మనం కష్టపడి సాధన చేసి గురువును ఆశ్రయించి

గురువు దయ సంపాదించి వాసనా రహితస్థితిని సంపాదించాలి కాని లేకపోతే ఈ వాసనలు అంత తేలికగా పోవు. దేహవాసన మనిషిని పీడించేస్తుంది. కొబ్బరికాయ పచ్చిగా ఉన్నప్పుడు ఆ లోపల ఉన్న గుంజుతోటి డిప్ప అంటుకొని ఉంటుంది. ఆ కాయ ముదరాలి, తరువాత దానిని ఎండబెట్టాలి, కురిడీకాయ అయిన తరువాత లోపల గుంజు, ఆ పెంకు విడిపోతాయి కాని అప్పటివరకు అవి విడిపోవు. అదేవిధంగా నువ్వు దేహం కాకపోయినా దేహము నేను అనే బుద్ధి అనేక జన్మలనుండి ఉంది. ఒకసారి గుడికి వెళ్ళి వెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకొని వచ్చేస్తే, ఒకసారి అరుణాచలం వెళ్ళి గిరి చుట్టూ తిరిగి వచ్చేస్తే పోతుందనుకొంటున్నావా? అది అంత తేలికగా పోదు. అనేక జన్మలు సాధన చేయాలి, కాలం కలిసిరావాలి, గురువు దయ ఉండాలి. ఇన్ని కలిసివస్తేగాని ఆ వాసనలనుండి బయటకు రాలేవు, ఇది తొందరపడితే వచ్చేదికాదు. మనం స్వార్థంతో ఉంటే మంచిపనులు చేయాలన్నా చేయలేము. మనలో స్వార్థం లేనప్పుడు మన ద్వారా మంచి పనులు జరుగుతాయి. ఈ దేహం చనిపోయేవరకు మనం స్వార్థంతో ఉంటే ఇంక మనం మంచి పనులు ఎలా చేయగలము. ధనం ఉన్నవారు ఎవరూ ధనవంతులు కాదు. ఇతరులకు ఎవరైనా సహాయ సహకారములు అందిస్తూ ఉంటే వాడు ధనవంతుడు. ఇతరులకు ఇచ్చేవాడు ధనవంతుడు కాని, ఇవ్వనివాడు ధనవంతుడు కాదు. నువ్వు దేహంగా ఉంటే చావు తప్పదు, పుట్టుక తప్పదు, మనస్సుగా ఉంటే కష్టసుఖాలు తప్పవు, క్షోభ తప్పదు. దేహవాసన అంత తొందరగా పోదు. నువ్వు ధైర్యంగా ఉండి ప్రయత్నం చేయాలి, శాంతిగా ఉండాలి, నీ నిదానంలో నువ్వు ఉండాలి, చెప్పడు మాటలమీద ఆధారపడకూడదు. భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకోవాలి. చేతులు సత్కర్మ మీద ఉండాలి, అది కూడా ప్రేమగా చేయాలి, మనం అందరం యాంత్రికంగా చేస్తాము. ప్రేమగా చేసేవాడికి కాలం తెలియదు. ఇతర విషయాలను చింతించకుండా మనస్సు ఎప్పడూ ఆత్మచింతన మీద ఉండాలి. ఇన్ని రకాలుగా ప్రయత్నం చేస్తే అప్పడు కదా నీకు వాసనాక్షయం అయ్యేది అంటున్నాడు పరమాత్మ.

ఈ దేహానికి నీకు ఎట్టి సంబంధం లేదు. దేహము నేను అనుకోవటం వలన, దేహము నేను అనే తలంపు వలన దేహం పుట్టినప్పడు నేను పుట్టాను, దేహం మరణించినప్పడు నేను మరణిస్తున్నాను అని అనుకొంటున్నావు. అహంభావికి ఈ రెండూ నిజం కింద కనిపిస్తున్నాయి. ఇది అంతా అసత్యమే. నీవు ఆత్మవై ఉన్నావు. ఆత్మకు చావులేదు, పుట్టుకలేదు. అహంభావం వెనకాలే ఆత్మ ఉంది. అది వెనుకకు తిరగటంలేదు, ఎంతసేపు

ముందుకు చూస్తోంది. అది వెనక్కి తిరిగితే ఆత్మానుభవం కలుగుతుంది. పూర్వజన్మలో చేసిన పుణ్యకర్మలను బట్టి, పాపకర్మలను బట్టి ఈ దేహం వచ్చింది. ఈ దేహం గొడవ ప్రారబ్దానికి వదిలెయ్యి. ఆ ప్రారబ్దం ఖర్చు అయ్యాక అది నశిస్తుంది. నీ నీడను నువ్వు ఎలా పట్టించుకోవటం లేదో అలాగ నీ దేహానికి వచ్చిన కష్టసుఖాలను కూడా నువ్వు పట్టించు కోవద్దు. అదంతా స్వప్నంతో సమానము. నీకు దేహం నేను అనే తలంపు ఉంది కదా. ఈ తలంపు ఎక్కడ నుండి వస్తోంది అని విచారణ చెయ్యి. అది ఒక మార్గం. మనకు ఒక యజమాని ఉన్నాడు, ఈ సృష్టిని నడిపే ప్రభువు ఒకడు ఉన్నాడు, ఆయన సంకల్పమే నెరవేరు తుంది, ఆయనకు తెలియకుండా ఏదీ జరుగదు అని ఆయనను పూర్తిగా విశ్వసించి ఆయనకు శరణాగతి చెందు. విచారణ వలన దేహగతమైన నేను నశిస్తుంది, శరణాగతి వలన అది నశిస్తుంది. నీకు తేలికగా ఉన్న మార్గంలో ప్రయాణం చెయ్యి. శబ్దానికి అర్థం తెలిస్తే మాకు తెలిసిపోయింది అనుకోవద్దు. మీరు హృదయంలోనికి వెళ్ళాలి కదా. ఆ మాట మిమ్మల్ని హృదయంలోనికి తీసుకొనివెళ్ళాలి కదా. భగవాన్ మాటలు మనం చెప్పకొంటున్నాము అనుకోండి. ఆయన దయ లేకపోతే వస్తువు యొక్క అనుభవం మాట అటు ఉంచండి, అసలు ఆ మాటలే మనకు అర్థం కావు. ఈ సంఘటన ఇలా జరుగుతోంది ఏమిటి? అని మీరు అనుకోవచ్చు. భగవంతుడికి తెలియకుండా ఏదీ జరగటం లేదు. మీకు మంచి జరిగితే అది ఈశ్వర ప్రసాదం అనుకోండి, చెడు జరిగినా అది కూడా ఈశ్వర ప్రసాదం అనుకోండి. నీకంటూ ఏ కోరిక ఉండకూడదు. అసలు నువ్వు అంటూ లేవు, ఉన్నది ఆయనే, చేసేది ఆయనే, మనం ఊరికే బొమ్మలం మాత్రమే. అందువలన దేనికి కంగారు పడవద్దు. కొంతమంది ఆత్మజ్ఞానం సంపాదించాలి అని మొదట ఇంటిలో పనిమాని వేస్తారు, ఇంక చీపిరికట్టకూడా ముట్టుకోరు. ఇంట్లో పనిమానివేస్తే జ్ఞానం రాదు, సోమరితనం వస్తుంది. వారు ఇంటికి పనికిరారు, సమాజానికి పనికిరారు. మీరు జాగ్రత్తగా ఉండండి. ఇవన్నీ మీ మంచికోసం, మీరు జాగ్రత్త పడటంకోసం చెపుతున్నాను. ఇది కంగారుపడితే వచ్చేది కాదు, నమిలి మింగేసేది కాదు, వాసనాక్షయం అవ్వాలి కదా. వాసనలు అంత తొందరగా పోవు. వాసనలు తొలగించుకోవటానికి మనం నెమ్మదిగా, స్టడీగా ప్రయత్నం చేయాలి.

మనం ఎవరినీ ఉద్ధరించనక్కరలేదు. మనలను మనం హింస పెట్టుకోకుండా ఉంటే సరిపోతుంది. మీరు రోజూ అశాంతికి గురి అవ్వకుండా ముందు శాంతిని

కాపాడుకోండి. మీకు శాంతి లేకపోతే ఇంక ఇతరులకు శాంతి ఎలా ఇస్తారు. మనం ఇతరులకు ప్రేమను నేర్పుతున్నామా, ద్వేషాన్ని నేర్పుతున్నామా అని అంతర్యామిగా ఉన్న భగవంతుడు చూస్తూనే ఉంటాడు. భక్తిపేరు చెప్పి మనం ప్రేమను, శాంతిని, జ్ఞానాన్ని ప్రచారం చేయాలి అంతేగాని అజ్ఞానాన్ని, ద్వేషాన్ని కాదు. ఒక మనిషిలో అజ్ఞానం ఉంది అనుకోండి, మనకు చేతనైతే అజ్ఞానం తగ్గించటానికి ప్రయత్నం చేయాలి. అంతేగాని వారిలో ఉన్న అజ్ఞానాన్ని పెంచుతూ ఉంటే మనం ఎత్తుకు ఎత్తు అనుభవించవలసి ఉంటుంది. చేసిన కర్మ వెంటాడటానికి కొంత టైము పడుతుంది. అప్పలు చేసేవారు అందరూ చేసేటప్పడు సంతోషంగా చేస్తారు, అప్ప తీర్చేటప్పడు ఏడుస్తూ తీరుస్తారు. అలాగే పొరపాట్లు చేసేటప్పడు సంతోషంగా చేస్తారట, వాటిని అనుభవించేటప్పడు ఏడుస్తూ ఉంటారట. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని విశ్వసించండి, ఆయన సర్వశక్తిమంతుడు. ఆయన మీద భారం వేస్తే నిన్ను ఒడ్డుకు తీసుకొని వస్తాడు. మనం ఈశ్వరుడి మీద భారం వేయటం లేదు, దేహము నేను అనే తలంపును నమ్ముతున్నాము. మొసలిని నమ్ముకొని నదిని దాటాలనుకోవటం ఎటువంటిదో దేహమే సర్వస్వం, దేహమే నిజం అనుకొంటూ మోక్షం పొందాలి అనుకోవటం కూడా అటువంటిదే. మొసలి నిన్ను నదిని దాటనివ్వదు. అలాగే దేహభావన కూడా నిన్ను తరింపచేయదు, జననమరణచక్రంలో తిప్పితిప్పి నిన్ను శుభ్రంగా పిప్పిచేసి విడిచిపెడుతుంది. మేము కర్మ చేస్తున్నాము అంటే కుదరదు నీవు చేసే కర్మ యోగం అవ్వాలి అంటున్నాడు పరమాత్మ. నువ్వు చేసేపని వల్ల నీవు పరిశుద్ధుడివి అవ్వాలి, నీవు చేసేపని వల్ల నీకు శాంత చిత్తం రావాలి, అది నిన్ను జననమరణ చక్రంలోనుండి విడుదల చేయాలి. నీవు కర్మను యోగంగా చేస్తే అది నీకు మోక్షాన్ని ప్రసాదిస్తుంది. కట్టెలు ఏవిధంగా అయితే శరీరాన్ని కాల్చి బూడిద చేస్తాయో, నేను ఎవడను అనే విచారణ దేహము నేను అనే తలంపును కాల్చి బూడిద చేస్తుంది.

శరీరానికి చావు వస్తోంది అంటే మనకు భయం వచ్చేస్తుంది. శరీరం చనిపోయిన తరువాత జీవితం ఉండదు అనుకొంటున్నాము అందుచేత మనకు భయం వేస్తోంది. జీవితానికి, చావుకు బేధం లేదు. జీవితానికి చావుకు బేధం లేదు అని నోటితో అనుకొంటే సరిపోదు. జీవితానికి, చావుకు బేధం లేదు అని తెలుసుకోవటం కూడా జ్ఞానమే. మందుపేరు వింటే సరిపోదు, దానిని మింగాలి. మందు పేరు వినకుండా నువ్వు మందు ఎలా కొనుక్కొంటావు. వినటం కూడా జ్ఞానంలో ఒక భాగమే అయితే అదే సర్వస్వం కాదు.

జీవితానికి, చావుకు బేధం లేదు. ఆ మాట వినాలి, విన్నదానిని ప్రాక్టీసు చేయాలి. ఈ జీవితం ఉండగానే జీవితానికి, చావుకు బేధం లేదు అన్న సంగతి నీవు గ్రహిస్తే నీ సహస్రారం అంతా ఆనందంతో నిండిపోతుంది. అప్పుడు నీవు సుఖం కోసం, ఆనందం కోసం బజారులో వెతకనక్కరలేదు. ఎప్పుడైతే సుఖం కోసం బయట వెతికేబుద్ధి పోయిందో నీకు పునర్జన్మ రాదు. వినటంకూడా జ్ఞానంలో ఒక భాగమే అది మర్చిపోకండి. విషయం తెలుసుకోవాలి కదా, విషయం తెలుసుకోకుండా హృదయంలోనికి ఎలా వెళతావు. మనం ఏదో సబ్జక్టు వింటాము, విన్నప్పుడు కొన్ని సందేహాలు వస్తాయి. సందేహాలు పోగొట్టుకోకపోతే మన మీద మనకు విశ్వాసం కలుగదు. మనకు ఎప్పుడైతే ఆత్మవిశ్వాసం కలుగదో మనం సాధన చెయ్యలేము. సాధన చెయ్యలేకపోతే మనం తరించలేము. రోజూ అనుమానాలు పెట్టుకొనే వాడికి ధ్యానం ఎక్కడ కుదురుతుంది. గురువును ఆశ్రయించి, శాస్త్రాన్ని ఆశ్రయించి ఆ అనుమానాలను తీర్చుకొంటేనే మీరు ధ్యానం చేయగలరు. నీ అహంకారాన్ని ఆలంబనగా పెట్టుకొని జీవించవద్దు. శాస్త్రాన్ని ఆధారంగా పెట్టుకొని జీవించు. అందరిలో ఉన్న ఈశ్వరుడిని ఎవడైతే దర్శిస్తున్నాడో వాడికి భయమేల? కోరిక ఏల? ద్వేషమేల? అందరిలో ఉన్న ఈశ్వరుడిని దర్శించే వాడికి దుఃఖంతో పనిలేదే, అశాంతితో పనిలేదే. నువ్వు ఏ వస్తువును తెలుసుకోవాలనుకొంటున్నావో దానికోసం జీవించు, దాని గురించే విను, దాని గురించే మాట్లాడు. ఆత్మగురించే శ్రవణం చెయ్యి. ఆత్మ గురించే మాట్లాడు, ఆత్మ గురించే జీవించు, దాని అనుగ్రహం సంపాదించటానికే జీవించు అప్పుడు ఆత్మ నీకు తెలియకుండా ఎలా ఉంటుంది. స్వార్థమే పరమార్థంగా పెట్టుకొన్నవాడికి ఆత్మజ్ఞానం ఏమిటి? మీ గురువే కనుక నిజమైన గురువు అయితే శరీరానికి చావు వచ్చినప్పుడు నూటికి నూరుపాళ్ళు సుఖంగా, శాంతిగా ఈ లోకాన్ని విడిచిపెట్టి బయటకు వెళ్ళాలి. మీరు దేవుడి పాదాల దగ్గర పుష్పాలు పెడుతున్నారు, మీరు చేసిన పనులు కూడా పుష్పాలకింద మారిపోయి దేవుడికి అలంకరింప బడాలి. మీ జీవితంలో అటువంటి పనులు ఎప్పుడైనా చేసారా? నీకు దేహము నేను అనే బుద్ధి ఉన్నంతకాలం ఏదో కోరిక వస్తూనే ఉంటుంది, కోరికలను ఆపుచేయలేవు. అసలు దుఃఖ కారణం బయటలేదు. నేను కర్తను అనుకొనే బుద్ధిలో నుండే దుఃఖం వస్తోంది. కర్త లేని కర్మ చెయ్యి, నీకు జ్ఞానం కలుగుతుంది. కర్తృత్వంతో చేస్తే ఆ పని నిన్ను బంధిస్తుంది, పునర్జన్మలకు కారణం అవుతుంది. ఎవడికైతే కర్తృత్వబుద్ధి నశించిందో వాడికి దుఃఖం వేరుతోసహా నశిస్తుంది. నిరంతరం మీరు దేహం గొడవలో ఉంటున్నారు. గాఢనిద్రలో

మీకు దేహం గొడవ ఉందా? పోనీ రాబోయే జన్మల గొడవ ఉందా? ఏదీ లేదు. ఇవన్నీ ఎప్పుడు వస్తున్నాయి? దేహము నేను అనే తలంపు వచ్చాక అన్నీ వస్తున్నాయి. ఈ మూల తలంపు నశిస్తే దుఃఖం లేదు, జన్మలు లేవు, వాడు దేహంలో ఉండగా దేహరహితుడు, లోకంలో ఉండగానే లోకరహితుడు అవుతాడు, పూర్ణస్థితిని పొందుతాడు.

మనలను ఎవరైనా చూస్తూ ఉంటే వారికి ఆనందం రావాలి కాని దుఃఖం రాకూడదు. మనలను ఎవరైనా చూస్తూ ఉంటే వారికి శాంతి రావాలి కాని అశాంతి రాకూడదు. నీకు ఏది మంచిది అనుకొంటున్నావో ఇతరులకు కూడా అదే మంచిది అనుకో. ద్వంద్వాలలో నుండి బయటకు రావటానికి ప్రయత్నించు. ఎవరైనా నిన్ను నిందించారు అనుకో, నీ మనస్సును కంగారు పెట్టుకోవద్దు. ఎవరైనా నిన్ను పొగిడారు అనుకో నువ్వు పొంగిపోవద్దు. ఈ రెండింటివలన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మనస్సు బాహ్యముఖానికి వెళ్ళే పనులు చేయవద్దు. ఎవరైనా మిమ్మల్ని నిందిస్తే అది మీకు మంచిది. ఎందుచేతనంటే మీ బుద్ధిలో ఉన్న దోషాలు వాళ్ళకి వెళ్ళిపోతాయి, భగవంతుడు వారిచేత అనుభవింపచేస్తాడు. ఎట్టిపరిస్థితులలోను మనస్సును బాహ్యముఖానికి రానివ్వద్దు. మనస్సు బాహ్యముఖానికి వస్తే దేహభావన పెరిగిపోతుంది, దానివలన చివరకు నరకం మిగులుతుంది. ఇతరులు మిమ్మల్ని పొగడటం వలన మీకు వచ్చే లాభం లేదు, వారు విమర్శించటం వలన మీకు వచ్చే నష్టం లేదు. ఆ మాటలను గాలికి వదిలేయండి, మీరు లోపలకు తీసుకోవద్దు. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించండి, మీకు అమృతానుభవం కలుగుతుంది. శరణాగతి అంటే ఏమీ లేదు. నీవు ఏదైతే నేను, నేను అనుకొంటున్నావో, ఆ నేనును అర్పించటమే శరణాగతి. నేను అనేది ఒక తలంపు, నాది అనేది ఒక తలంపు. ఈ రెండు తలంపులు నిజం కాదు. ఈ తలంపులు కొన్ని వేల జన్మల నుండి మనకూడా వచ్చేస్తున్నాయి. వాటిని వేసుకొని తిరుగుతున్నాము. మీకు చదువు ఉందని, డబ్బు ఉందని మీకు అశాంతి పోదు, దుఃఖం పోదు. ఈ రెండు తలంపులలో నుండి విడుదల పొందితే నీవు అసత్యంలోనుండి, అశాంతిలో నుండి బయటకు వస్తావు. దుఃఖాన్ని తీసుకొని వచ్చే ఈ రెండు తలంపులలో నుండి విడుదల పొందితే నీవు సుఖి అవుతావు. నీవు గురువు యొక్క దయను సంపాదిస్తే ఆయన జ్ఞాన నేత్రాన్ని ప్రసాదిస్తాడు అప్పుడు నీకు చైతన్యానుభవం కలుగుతుంది. అంతేగాని మన తెలివి తేటలవలన ఏదీ రాదు. భగవద్గీతలో చెప్పకుండా విడిచిపెట్టిన విషయం అంటూ ఏమీ లేదు. అవన్నీ ఊహించి రాసినవి కాదు, వ్యాసుడు దర్శించి వ్రాసాడు. మీరు భగవద్గీతను

ఆరాధించండి. అలా ఆరాధించగా, ఆరాధించగా భగవద్గీతను అధ్యయనం చేయాలనిపిస్తుంది. గీతలో చెప్పినట్లు జీవించాలనిపిస్తుంది, నారాయణుడిని ఆరాధించాలని పిస్తుంది, ఆయనలో ఐక్యం అవ్వాలనిపిస్తుంది. ఇవన్నీ జ్ఞానంలో భాగాలే. ఎక్కడో మోక్షం దాకా వెళ్ళనక్కరలేదు. మీరు భగవంతుడి యొక్క వైభవాన్ని బుద్ధితో గ్రహించి, మీ హృదయంలో ధ్యానం చేస్తూఉంటే అప్పుడు వచ్చే ఆనందాన్ని, సుఖాన్ని మీరు తట్టుకోలేరు. ఓ అరుణాచలేశ్వరుడా! నీ పాదాలను పట్టుకొంటే కదా ఈ మాయలో నుండి బయటపడేది, నీ పాదాలను ఆశ్రయిస్తే కదా అజ్ఞానంలో నుండి బయట పడేది. నీ పాద ద్వయం చాలు మాకు అదే సంపద, అదే మాకు భాగ్యం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-02-06, గణపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీరు ఏ దేవతను ఆరాధించినా కృష్ణుడినికాని, శివుడినికాని, రాముడినికాని, సాయిబాబానుకాని ఎవరిని ఆరాధిస్తున్నప్పటికీ మీరు సబ్జక్టు బాగా వినాలి, సబ్జక్టు బాగా అర్థం చేసుకోవాలి. శివపురాణంలో శివుడు చాలా ఎక్కువవాడని, విష్ణుపురాణంలో విష్ణువు చాలా ఎక్కువవాడని ఇలా ఏ పురాణం వ్రాసినప్పుడు ఆ పురాణానికి సంబంధించిన దేవతకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి వ్రాసారు అంటే ఇందులో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అని కాదు. ఉన్నది ఒక్కటే వస్తువు. దానినే కొంతమంది విష్ణువు అని, కొంతమంది శివుడని, కొంతమంది సాయిరామ్ అని అంటున్నారు. ఎవరి అభిరుచినిబట్టివారు పిలుస్తున్నారు. ఆ రూపాన్ని ధ్యానించటం వలన, ఆ నామాన్ని స్మరించటం వలన మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది, మనోనిగ్రహం వస్తుంది. సత్పురుషులతో సహవాసం చేస్తే సుఖపడతాము. సత్పురుషులు కానివారితో సహవాసం చేయటం వలన అశాంతి మిగులుతుంది, దుఃఖం మిగులుతుంది. మనకు దాహం వేస్తే మంచినీళ్ళు తాగగలం, ఆకలి వేస్తే అన్నం తినగలం. దాహం లేకపోతే నీళ్ళు తాగలేము, ఆకలి లేకపోతే అన్నం తినలేము. అలాగే మోక్షం పొందాలి అనే కాంక్ష ముముక్షత్వం లోపలనుండి రాకపోతే మోక్షం కోసం మనం ప్రయత్నం చేయలేము. మనం తిరిగి ఈ ప్రకృతిలోనికి రాకుండా ఉండాలంటే, అసత్యంలో నుండి బయటపడాలంటే మనకు భగవంతుడి మీద భక్తి కలగాలి, ప్రేమ కలగాలి. మనకు మంచి స్నేహితులు దొరకాలి, మంచి పరిసరాలు దొరకాలి, మంచి గురువు దొరకాలి. మనకు పూర్వపుణ్యం లేకపోతే ఇన్ని అవకాశాలు రావు. మన తెలివితేటల వలన ఏమీ జరుగదు. మనం ఏ పనిచేసినా

దుఃఖంగా చెయ్యకూడదు, సంతోషంగా చెయ్యాలి. కొంతమంది పనిచేస్తారు కాని ఏడుపు ముఖాలతో చేస్తారు, అలాకాదు, మీరు చేసేపని ఇష్టంగా ప్రీతిగా చెయ్యండి. మీరు పని చేసే పద్ధతిలోనే మీకు భగవంతుడి దయ కలగాలి. మీరు ఏదో గుళ్ళు కడుతున్నారు పది మందికి ఉపకారం చేస్తున్నారు, మంచిదే కాని వీటిఅన్నింటికంటే మనలను మనం బాగు చేసుకోవటం ముఖ్యం. మీరు బాగుపడాలి, మీరు శాంతిగా ఉండాలి, మీరు జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. మీ శాంతిని కొంతమందికి పంచిపెట్టాలి, అంతేగాని మీకు నిగ్రహం లేకుండా, మీరు మోక్షం కోసం ప్రయత్నం చేయకుండా అక్కడ ఏదో చేసాము, ఇక్కడ ఏదో చేసాము అంటే అవన్నీ రెండో పక్షం. మీరు బాగుపడటం ముఖ్యం. మీరు కుళ్ళిపోయాక ఏవో మంచి పనులు చేసినా ప్రయోజనం లేదు. అసలు సబ్జెక్టు మీకు తెలియాలి. సబ్జెక్టు అంటే ఎందుకు ఇష్టం ఉండటం లేదు అంటే దీనికి మెదడుకు కొంతపని చెప్పాలి, సొంత ఆలోచన ఉండాలి. కాని మనం సోమరితనానికి అలవాటుపడిపోయాము. సబ్జెక్టు అర్థం చేసుకోకుండా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. మేము కూడా సబ్జెక్టు చెప్పేటప్పుడు భగవంతుడు ఎలా చెపితే అలా ప్రెజెంట్ చెయ్యాలికాని మిమ్మల్ని ఆకర్షించే మాటలు, ఉద్రేకపరిచే మాటలు చెప్పకూడదు. మీరు బాగుపడాలి, మీకు బుద్ధిసూక్ష్మత కలగాలి, మీకు భగవంతుడి యందు భక్తి కలగాలి, మీకు భగవదనుభవం కలగాలి అనే ఉద్దేశ్యంతో మేము చెప్పాలి కాని మీ చేత చప్పట్లు కొట్టించుకోవటానికి మేము చెప్పకూడదు. మీరు లోపల అశాంతిగా ఉంటే మీ చప్పట్లు మాకు ఎందుకు? మేము చెప్పేది మీకు ఎంతవరకు అర్థమవుతోందో అది కూడా మేము చూసుకోవాలి. మేము చెప్పేది మీకు అర్థంకాకపోతే ఆ పొరపాటు మాదేకాని మీది కాదు. లోకంలో ఏమీ లేదు, అంతా మీ మనస్సులోనే ఉంది. మీ మనస్సును జాగ్రత్తగా నియమించుకోకపోతే మీ బాహ్యపరిస్థితులు బాగా ఉన్నా మీకు శాంతి రాదు. మీ శాంతికి, అశాంతికి కూడా మనస్సే కారణం. మీ మనస్సును బాగు చేసుకోవాలి. మీ మనస్సును బాగుచేసుకోవటం, మీకు పని కింద కనబడకపోతే అంతకంటే ముఖ్యమైన పని మీకు ఈ లోకంలో ఏమి ఉంది. ఈ శరీరం చనిపోయాక మీ కూడా మనస్సు వస్తుంది. మీరు సంపాదించిన ఆస్తులుగాని, మీరు కట్టించిన బిల్డింగులు కాని, మీ బంధువులు కాని ఎవరూ మరణానంతరం మీకూడా రారు. మరణానంతరం మనకూడా వచ్చే జీవుడిని మనం పట్టించుకోవటం లేదు, ఇది దురదృష్టం. మనకు పూర్వపుణ్యం లేదు. సబ్జెక్టు చెప్పేవారు తగ్గిపోతున్నారు. మీరు రమణకేంద్రంలో రోజూ పూజలు పెట్టేయండి. ఎందుకు కష్టపడి

దేశం అంతా తిరుగుతారు. ఇక్కడ పూజలు చేయించుకొన్నవారికి కోరికలు నెరవేరతాయి అనికూడా చెపుతూ ఉండండి. జనం అంతా ఇక్కడికే వచ్చేస్తారు. ఈ పూజలు, జపాలు వదిలేసి మీరు ఎందుకు కష్టపడి సబ్జక్టు చెప్పటం అని ఈ మధ్య నన్ను అడిగారు. నాకు దేవుడు ముఖ్యం కాదు, నాకు మనిషి ముఖ్యం అని చెప్పాను. కనిపిస్తున్న మనిషి మీదే నాకు ప్రేమలేనప్పడు, ఆప్యాయత లేనప్పడు ఎక్కడో కనిపించని దేవుడి మీద నాకు ప్రేమ ఉంది అని ఎవరైనా చెపితే అటువంటి మాటలు నమ్మటానికి వీలులేదు అని స్వామీజీ చెప్పారు.

పూజ, జపం కూడా ఇంద్రియనిగ్రహానికి, మనోనిగ్రహానికి మన పెద్దలు ఏర్పాటు చేసారు. మీకు కోరికలు నెరవేరాలంటే దానికోసం పెద్ద ప్రయత్నం ఏమీ చేయనక్కరలేదు. మీ పని మీరు శ్రద్ధగా చేసుకొంటూ భగవంతుడి పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే మీకు ఎప్పడు ఏ కోరికలు నెరవేరాలో అప్పడు అవి సహజంగానే నెరవేరతాయి. అది ఈశ్వరుడు చూసుకొంటాడు. నువ్వు చేసేపని యోగంగా చెయ్యి. దండలో మీకు పైకి పుష్పాలు కనిపిస్తూ ఉంటాయి. లోపల ఉన్న దారం కనబడదు, కాని దారం సపోర్టుగా ఉంది. అలాగే అందరి హృదయాలలో భగవంతుడు ఉన్నాడు. మనకు శరీరాలు కనిపిస్తున్నాయి మనస్సు తెలుస్తోంది. దండలో ఉన్న దారం మనకు ఎలా కనబడటం లేదో అలాగ అందరి హృదయాలలో ఆధారంగా ఉన్న నారాయణుడు మనకు తెలియటంలేదు. ఎదుటి మనిషి యొక్క రూపాన్ని ప్రక్కనపెట్టి, వాడి గుణాన్ని ప్రక్కన పెట్టి మీరు చేసిన పనిని లోపల ఉన్న నారాయణుడికి సమర్పిస్తూ ఉంటే ఆయన దయ మనకు కలుగుతుంది. అప్పడు ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, అదే మోక్షం. మీరు ఏపని చేసినా శాంతిగా చేయండి, ఆందోళనగా చేయవద్దు. మీరు ఇతరులకు ఏదైనా ఉపకారం చేసినా అశాంతిగా చేస్తే, గుర్తింపులకోసం చేస్తే మీకు జ్ఞానం రాదు, వారు సుఖపడరు. మనం ఎవరికైనా పది రూపాయలు ఇస్తే లేక ఏదైనా ఉపకారం చేస్తే వారికంటే మనం గొప్పవారము అనే భావన వచ్చేస్తుంది. అంటే అసలు పని ఎలా చెయ్యాలో మనకు తెలియదని గుర్తు. మీరు సాధన చేస్తున్నారా అని ప్రతివాడు అడుగుతాడు. అసలు సాధన ఎందుకు చేయాలో కూడా అడిగేవాడికి తెలియదు. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేనే సాధన చేస్తుంది. మనం సాధన చేసి తొలగించుకోవలసింది కూడా ఆ నేనునే. మనం సాధన చేసి దేనిని తొలగించుకోవాలో కూడా మరిచిపోయాము. బాహ్యంగా మీరు లోకంలో మంచి పనులు చేసి, దేనినైతే తొలగించుకోవాలో దానిని

పెంచుకొంటూ ఉంటే మీకు పుణ్యం వస్తుంది కాని చిత్తశుద్ధి రాదు, ఇలా కోటిజన్మలు ఎత్తినా మీకు జ్ఞానం రాదు. మనం ఏదైతే నేనే నేను అంటున్నామో దానిని ఊరేగించకూడదు. సాధనపేరుమీద దానిని పోగొట్టుకోవటం మానేసి దానిని పెంచుకొంటూ ఉంటే అది సాధనా?

నీ హృదయంలో ఉన్న బ్రహ్మం సత్యం. ఆ బ్రహ్మమునే ఒకడు దేహం అనుకొంటున్నాడు, ఒకడు మనస్సు అనుకొంటున్నాడు, ఒకడు బుద్ధి అనుకొంటున్నాడు, ఒకడు డబ్బు అనుకొంటున్నాడు. ఇవిఅన్నీ ఆ బ్రహ్మంనందు కల్పించుకొంటున్నావు అంతే. ఇవన్నీ లేవు కాని నీవు కల్పించుకొంటున్నావు. ఇది ఎప్పుడు తెలుస్తుంది అంటే బ్రహ్మంను తెలుసుకొన్నాక ఇదంతా అసత్యం అని నీకు తెలుస్తుంది. అందరి హృదయాలలో భగవంతుడు సమానంగా ఉన్నాడు, ఒక్కడుగా ఉన్నాడు. మరి ఒకరి మీద నీకు ఇష్టం వస్తోంది, ఒకరి మీద అయిష్టం వస్తోంది అంటే లోపల అంతర్యామిగా ఉన్న నారాయణుడిని నువ్వు చూడలేకపోతున్నావు. పైపైన చూస్తున్నావు కాని లోపలకు వెళ్ళలేకపోతున్నావు. రాగద్వేషములను పెంచుకొంటున్నావు. ఇలా ఉన్నంత కాలం శవాలను మోయటం తప్పదు. ఇలాగ ఎంతకాలం, ఎన్ని శవాలను మోస్తావు. కృష్ణుడు గీతలో ఏమని చెప్పాడు అంటే మీరు సాధన బాగా చేసుకొంటూ ఉంటే, మీరు నారాయణుడి పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే మరల మీకు ఎటువంటి కుటుంబాలలో శరీరాన్ని ఇస్తే మీకు అనుకూలపరిస్థితులు వస్తాయో, ఎటువంటి కుటుంబాలలో జన్మ ఇస్తే మీకు అజ్ఞానం నశిస్తుందో అటువంటి కుటుంబాన్ని మీకు నేను ప్రసాదిస్తాను అని పరమాత్మ చెప్పాడు. అంటే మనం చేసింది ఊరికే పోదు. మన ఇంట్లో వారికి కూడా మన డ్యూటీ మనం చేయాలి, మన ధర్మం మనం నిర్వర్తించవచ్చు కాని ఎక్కువ మమకారం పెట్టుకోకూడదు. ఎక్కువ మమకారం పెట్టుకొంటే మనస్సులో దోషం పెరిగిపోతుంది, మనం పాడైపోతాము. మమకారం లేకుండా పనిచేసాము అనుకోండి మనం శాంతిగా ఉంటాము, సుఖంగా ఉంటాము, ఈశ్వరుని దయకు పాత్రులవుతాము. ఇక్కడ పని అయిపోతుంది, మనకు శాంతి కలుగుతుంది. కొంతమందికి చిన్న సంఘటనలు జరిగినా వాడికి ఏదో ఉపద్రవం వచ్చినట్లుగా ఉంటుంది. అందులో ఏమీ లేదు అని వాడికి తెలియటం లేదు. నీకు అనుకూలమైన సంఘటనలు జరిగినా, ప్రతికూలమైన సంఘటనలు జరిగినా శాంతిని కాపాడుకొంటూ ఉంటే నీవు ఈశ్వరుడి దయకు పాత్రుడవుతావు. మనకు పూర్వపుణ్యం లేకపోతే అసలు భగవంతుడి యందు భక్తి కూడా మనకు కలుగదు, మంచి గ్రంథం చదవాలని, మంచిని శ్రవణం చేయాలనే సంస్కారం కూడా మనకు రాదు. మీ

బంధువులుగాని, స్నేహితులుగాని, విరోధులుగాని లేకపోతే బాహ్యంగావచ్చే భూకంపాలు గాని, గాలివానలుగాని వీటిఅన్నింటికంటే నీ దుఃఖానికి, అశాంతికి నీ మనస్సే కారణం, వీటిఅన్నింటిని నీ లోపలఉన్న జీవుడే కల్పిస్తున్నాడు అన్న సంగతి నీకు తెలియటం లేదు. ఇది నీకు బోధపడితే ఇప్పడే ఇక్కడే నీవు వైకుంఠాన్ని అందుకొంటావు.

మనుషులు రకరకాలుగా ఉంటారు. కొంతమంది రజోగుణంతో ఉంటారు, కొంతమంది తమోగుణంతో ఉంటారు, కొంతమంది సత్వగుణంతో ఉంటారు. కొంతమంది మంచిపనులు చేస్తూ ఉంటారు, కొంతమంది చెడ్డపనులు చేస్తూ ఉంటారు. ఏదో వాళ్ళ సంస్కారాన్ని బట్టి అలా చేస్తూ ఉంటారు, వారి గోల నీకు ఎందుకు? వారి హృదయంలో అంతర్యామిగా ఉన్న నేను, నీకు కనిపించటం లేదా అంటున్నాడు పరమాత్మ. భ్రాంతి అనేది, భ్రమ అనేది లోపలే ఉంది. అది అంత తేలికగా పోదు. గురువుఅనుగ్రహం లేకుండా, సజ్జన సాంగత్యం లేకుండా, శాస్త్రసహాయం లేకుండా లోపలఉన్న భ్రాంతి పోదు. జ్ఞాని విషయాలలో కూడా బ్రహ్మమునే చూస్తాడు. అందుచేత వాడికి ఆకర్షణ లేదు. అంతా తానే. అంతా తానే అయిన వాడికి ఇంక కోరిక ఏమిటి? మనకు కోరిక ఉంటే ఆ పని అవుతుంది, కోరిక లేకపోతే పని అవ్వదేమో అనుకొంటాము. నీ దేహప్రారబ్ధంలో ఉన్నప్పడు కోరికతో సంబంధం లేకుండా, మన సంకల్పంతో సంబంధం లేకుండా ఎప్పడు ఎలా అవ్వాలో ఆపని అయిపోతుంది. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీవు కృత్రిమంగా ఉండవద్దు, సహజంగా ఉండు. నీ కోరికలు కూడా సహజంగా నెరవేరతాయి. మాకు ఏమీ లేదు అని చెప్పటానికి కొంతమంది సిగ్గుపడతారు. దానికి ఏమీ సిగ్గుపడవలసిన అవసరం లేదు. వెయ్యికోట్లు ఉన్నది అసత్యమే, నాకు ఏమీలేదు అనుకోవటం అసత్యమే. ఇది ఎంత అసత్యమో అది కూడా అంతే అసత్యం. ఇవన్నీ బ్రహ్మంనందు ఆరోపింపబడుతున్నాయి. విషయాలమీద నీ మనస్సును నిలబెట్టవద్దు, ఆత్మయందు నీ మనస్సును నిలబెట్టు. నీకు విషయాల మీద ఆసక్తి వద్దు, పరమాత్మ మీద ఆసక్తి పెట్టుకో. గాలి కూడా నాకు గురువే అన్నాడు దత్తాత్రేయుడు. ఎందుచేతనంటే గాలి అలా ప్రవహిస్తూ ఉంటుంది, దానికి ఏమీ ఆసక్తి ఉండదు. ఆసక్తి లేకుండా ఎలా జీవించాలో గాలిని చూసి నేర్చుకొన్నాను అన్నాడు. భూమికి ఉన్నంత ఓర్పు దేనికి ఉండదు. మనం భూమి మీద ఉమ్ములు వేస్తాము, అన్నీ విసర్జిస్తాము. కాని భూమి చాలా సహనంగా ఉంటుంది. సహనంగా ఎలా ఉండాలో, ఓర్పుగా ఎలా ఉండాలో భూమి నాకు నేర్పింది అందుచేత భూమి కూడా నాకు గురువే అంటాడు.

మనకు వినయం లేదు, సహనం లేదు అందుచేత అజ్ఞానం పెరిగిపోతోంది. నీరు ఏవిధంగా అయితే పల్లంలో నిలబడుతుందో అలాగ సహనం ఉన్నచోట, వినయం ఉన్నచోట జ్ఞానం నిలబడుతుంది. వినయమే సంపద. వినయం ఉన్న వాడికి దేహాభిమానం తగ్గుతుంది. మేము అడవిలో తపస్సు చేసుకొంటున్నాము, రాక్షసులు మమ్మల్ని బాధపెడుతున్నారు. రాక్షస సంహారం కోసం నీ సహాయం అవసరం అని విశ్వామిత్రుడు వచ్చి దశరథ మహారాజును అర్థిస్తాడు. మీరు మా ఇంటికి రావటం, నా సహాయం అడగటం ఇంతకంటే నాకు భాగ్యం ఏముంది అంటాడు దశరథుడు. ఇప్పుడు మీ ఇంటికి ఎవరైనా సహాయం కోసం వస్తే మీరు ఏమనుకొంటారు అంటే వాడు తక్కువవాడు, నేను గొప్పవాడిని అనుకొంటారు. దశరథ మహారాజు ఏమన్నాడు అంటే మీరు నా సహాయం అడుగుతున్నారు అంటే అది నా పూర్వ పుణ్యం అన్నాడు. అలా మనలో అనేవాడు ఎవడైనా ఉన్నాడా? స్నేహాలు మంచివి కాకపోతే మనం కూడా కైకలాగ అయిపోతాము. రాముడికి పట్టాభిషేకం చేస్తారనే వార్త వినగానే కైక చాలా సంతోషించింది, కాని మంథర దాని బుర్రను పాడుచేసేసింది. కైకకు లోపల రజోగుణం ఉంది, ఆ రజోగుణాన్ని మంథర పైకి లాగింది. మన నిదానంలో మనం లేకపోతే సహవాసదోషం వలన కైక ఎలా పొరపాటు చేసిందో మనం కూడా అలాగే అవుతాము. మనకు అసూయ ఉంది అనుకోండి, అసహనం ఉంది అనుకోండి. వాటిని తగ్గించు కోవటానికి ప్రయత్నం చేస్తున్నాము అనుకోండి. లోపల కొంచెం ఉంది అనుకోండి, చెడు స్నేహితులు ఏమి చేస్తారు అంటే దానిని పొయ్యిలో పెట్టి ఊదినట్లు ఊదుతారు. అసూయను పెంచేస్తారు, అసహనం పెంచేస్తారు, మనలను పతనం చేస్తారు, వారు పతనమవుతారు. జ్ఞానికి అసూయ, అసహనం వంటివి బీజరూపంలో కూడా ఉండవు. అందుచేత చెడ్డ వాళ్ళు వచ్చి జ్ఞానిని ఏమీ చేయలేరు. మనం అజ్ఞానంలో నుండి బయట పడాలి అనుకొంటున్నాము, జ్ఞానాన్ని సంపాదించాలి అనుకొంటున్నాము. అటు ఇటు కాకుండా ఉన్నాము కాబట్టి బహు జాగ్రత్తగా ఉండాలి. అజ్ఞాని ఎలా ఉన్నా ఫరవాలేదు. అసలు నేర్చుకోవాలనే బుద్ధి వాడికి లేదు. జ్ఞానికి ఏమీ ఇబ్బంది లేదు, వాడు కొండలా ఉంటాడు. కొండను గాలి ఏమి చేస్తుంది.

మీకు బాగుపడాలనే తలంపు వచ్చాక బాగుపడటానికి ప్రయత్నం చేస్తారు కాని అసలు బాగుపడాలనే తలంపు లేనప్పుడు ఇంక ప్రయత్నం ఏముంది. ఆ బాగుపడాలనే తలంపు రావటానికే పూర్వపుణ్యం ఉండాలి, పూర్వజన్మలలో సత్కర్మచేసి ఉండాలి, అది కూడా

నిష్కామంగా చేసి ఉండాలి. గురువు అనుగ్రహం ఉండాలి. ఇన్ని కలిసి వస్తేకదా బ్రహ్మజ్ఞానం సంపాదించాలనే జిజ్ఞాస నీకు కలిగేది. మీకు బాగుపడాలనే కాంక్ష ఉన్నప్పుడు కదా గురువు చెపితే ప్రయోజనం. సర్వసాధారణంగా మనం ఏమనుకొంటాము అంటే మాకు అయిదు ఎకరాలు పొలం ఉంది, బ్యాంకులో లక్ష రూపాయలు ఉన్నాయి, మాకు ఏమీ లోటు లేదు అనుకొంటాము కాని భగవంతుడు ఉన్నాడు నాకు ఆయనే దిక్కు, నాకు ఏమీ లోటు లేదు అని మనం అనుకోము, దీనికి మన పాడుబుద్ధి కారణం. ఈశ్వరుడు చెప్పిన మాటలను చెవులతో వినండి, చెవుల దగ్గర మీ మనస్సు ఉండాలి. మీరు విన్న మాటలను మననం చేసుకోండి. మీకు వెంటనే ఆత్మజ్ఞానం కలుగకపోయినా ఈ ప్రక్రియలో మీరు చాలా దోషాల నుండి, బలహీనతల నుండి బయటకు వచ్చేస్తారు. ఈమధ్య పాలకొల్లు నుండి ఒకరు నా దగ్గరకు వచ్చారు. ఆయన ఏమి అన్నారు అంటే నేను తొందరగా చనిపోవాలని అనుకోవటం లేదు, ఎక్కువకాలం జీవించాలని అనుకోవటం లేదు. నా ఆయుర్ధాయం ఎంత ఉంటే అంత కాలం నా వలన ఎవరికీ అపకారం జరగకూడదు, జరిగితే ఉపకారం జరగాలి. నేను మంచిపనులు చేసేటట్లు అనుగ్రహించండి నాన్నగారు సరిపోతుంది అంతేగాని నా ఆయుర్ధాయం పెంచమని అడగటానికి మీ దగ్గరకు రాలేదు అన్నారు. అపూర్వం, ఎంత అందంగా ఉందో చూడండి. సత్కర్మ చేసిన వాడికి, మంచి తలంపులు వచ్చే వాడికి, హెచ్చు తగ్గులు లేకుండా జీవించేవాడికి దుర్గతి లేదు అని పరమాత్మ చెప్పాడు. మీకు భోగం వలన ఆనందం రావచ్చు, యోగం వలన కూడా ఆనందం వస్తుంది. భోగం వలన వచ్చే ఆనందాలన్నీ జన్మలను పెంచేస్తాయి. భోగానందం వలన నీవు శవాలను మోస్తూ ఉండవలసిందే. యోగానందం జన్మలను ఆపుచేస్తుంది, ఇంక ఇదే కడసారి జన్మ, నేను ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నాను అనుకొనేవాడు కూడా పత్తా లేకుండా పోతాడు, అదీ యోగానందం. నీవు జిజ్ఞాస పెంచుకో, జ్ఞానాన్ని సంపాదించుకో. జ్ఞానసముపార్జన ప్రక్రియలోనే పునర్జన్మను తీసుకొనివచ్చే బలహీనతలు అన్నీ కాలిపోతాయి. అట్టిది జ్ఞానం. జ్ఞానంతో సమానమైన వస్తువే లేదని నేను చెపుతూ ఉంటే దానికి మించిన వస్తువు ఉందని నువ్వు మటుకు ఎలా అనుకొంటావు. ఎదుటి మనుషులలో ఉన్న గుణాలను చూడకండి, అందరిలో ఉన్న నారాయణుడిని చూడండి. ఎదుటివారిలో ఉన్న గుణాలను చూస్తూ ఉంటే అవి మీకు అంటుకొంటాయి.

నువ్వు ఎవరికీ చెడ్డ కోరకు. ఈ జీవకోటి అంతా క్షేమంగా ఉండాలని కోరుకో.

నువ్వు చెయ్యగలిగితే మంచి చెయ్యి, లేకపోతే ఊరక ఉండు. అన్ని భూతాలకు హితవే చెయ్యి, అహితవు చెయ్యకు. ఎవడైనా నీకు అహితవు చేస్తే నువ్వు మరల అహితము చెయ్యకు, వాడికి హితవే చెయ్యి. ఎందుచేతనంటే వాడిపని వాడు మాననప్పుడు నీ పని నువ్వెందుకు మానాలి. హితవు చెయ్యటం నీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా భగవంతుడు చెపుతున్నాడు కాబట్టి చెయ్యి. ఎవడైతే ఈ సృష్టికి కర్తో, ఎక్కడ నుండి అయితే ఈ జీవకోటి వస్తోందో మరల ఎక్కడ అయితే ఈ జీవకోటి లయమవుతోందో వాడు చెప్పిన బోధ భగవద్గీత. ఇది మహాగ్రంథము, వేదసారము. బ్రహ్మానందం ఎటువంటిది అంటే మన శరీరానికి మరణం వచ్చి శరీరం మన నుండి విడిపోతున్నా మనం ఆ ఆనందంలో నుండి జారిపోము. సునామి వచ్చి ఈ లోకాన్ని ఊడ్చుకొని పోతున్నా నీ ఆనందానికి భంగం ఉండదు, అట్టిది బ్రహ్మానందం. ఈ దేహం నిజం కాదని, ఇంద్రియాలు నిజంకాదని, నీచేత చూడబడుతున్న ఈ పంచ భూతాలు నిజంకాదని నీకు బ్రహ్మానందంలో ఎరుకలోనికి వస్తుంది. అప్పడు ఈ లోకం కనిపిస్తే ఏమిటి? కనిపించకపోతే ఏమిటి? దేహం ఉంటే ఏమిటి? ఊడిపోతే ఏమిటి? అది ఏదో కారణం వలన వచ్చే ఆనందం కాదు, కల్పించుకొన్న ఆనందం కాదు. అటువంటి బ్రహ్మానందం ఎవరికి దొరుకుతుంది అని ప్రశ్నించి ఆయనే సమాధానం చెపుతున్నాడు. ఋషి మాత్రుడికే దొరుకుతుంది అన్నాడు. ఋషి అంటే ఎవడు సత్యసాక్షాత్కారం పొందినవాడు. మేము చాలా పుణ్యాలు చేసాము, మేము పుణ్యాత్ములం అని కొంతమంది అనుకొంటారు, వారికి కూడా బ్రహ్మానందం దొరకదు. ఈ పుణ్యాలు, పాపాలు మొత్తం అన్నీ నశిస్తేకదా బ్రహ్మానందం దొరికేది. మేము చాలా మంచి పనులు చేస్తాము అని కొంతమందికి గర్వం ఉంటుంది. ఆ చెప్పేవాడు కూడా పత్తా లేకుండా పోతేగాని, వాడు వేరుతో సహా నశిస్తేగాని నీకు బ్రహ్మానందం దొరకదు. సబ్జెక్టు చెప్పటం దగ్గరకు వచ్చేటప్పటికి ఇంక మొహమాటం లేదు. మన కంటిలో ఏదైనా దోషం ఉంటే బయట ఉన్న వస్తువు సరిగా కనబడదు. మనస్సులో మమకారం ఉంటే శాస్త్రాన్ని ఉన్నది ఉన్నట్లుగా అర్థం చేసుకోలేము. మమకారం కూడా గుడ్డితనమే అది మనస్సుకు గుడ్డితనం. మమకారం ఉంటే ఈశ్వరుడు చెప్పిన మాటలలో ఉన్న సౌందర్యం కూడా మీకు కనబడదు. భవిష్యత్‌లో మనకు ఏదైనా నీచ జన్మలు వచ్చే యోగం ఉంటే భగవంతుడు చెప్పిన మాటలను మనం పట్టించుకోము. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే స్థిరనిశ్చయం విషయంలో సంశయం పెట్టుకోవద్దు. కాలులో ముల్లు ఎటువంటిదో మనస్సుకు సంశయం అటువంటిది. సంశయం

ఉన్నవారు అభివృద్ధిలోనికి రాలేరు. కొంతమందికి మాటలో బేలన్స్ ఉంటుంది, ఆలోచనలో బేలన్స్ ఉంటుంది. ఏ పని చెయ్యాలి, ఏపని చెయ్యకూడదు అనే విభజన, వివేకం ఉంటుంది, వైరాగ్యం ఉంటుంది. లోకంలో ఉన్న ఆకర్షణలలోనికి వెళ్లకుండా వైరాగ్యం నిన్ను కాపాడుతుంది. మీ హృదయంలో నారాయణుడు ఉన్నాడు. ఆయనను వదిలేసి బయట పరిస్థితుల మీద ఎంతకాలం ఆధారపడి ఉంటారు. మీ హృదయంలో ఉన్న ఆనందసముద్రాన్ని వదిలేసి బయటవారి మీద ఎంతకాలం ఆధారపడతారు. వారు మర్యాదగా ఉంటే మీరూ మర్యాదగా ఉండండి, అంతేగాని మీ సుఖం కోసం వారి మీద ఆధారపడటం ఏమిటి? ఇలా ఎన్ని జన్మలు ఉంటారు, ఎన్ని శవాలను మోస్తారు. యోగం అంటే మన ఇంద్రియాలు, మన మనస్సు మన స్వాధీనంలో ఉండాలి. వాటిని అదుపులో పెట్టుకొని ఒకవేళ మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా గర్వం లేకుండా చూసుకోవాలి. బాహ్యంగా మీరు ఎవరికీ ఏమీ సహాయం చేయలేకపోవచ్చు. వారు బాగుండాలి అని అనుకోవటంలో దారిద్ర్యం ఎందుకు? ఇంట్లో దారిద్ర్యం ఉంటే ఉండనివ్వండి, మనస్సులోమటుకు దారిద్ర్యం వద్దు. మనస్సులో మటుకు ధనవంతులుగానే ఉండండి, అప్పుడు మీరు దైవానుగ్రహానికి పాత్రులవుతారు. స్వార్థపరుడు తన స్వార్థం కోసం ఎంత కష్టపడి పనిచేస్తాడో అలాగ మిమ్మల్ని మీరు బాగుచేసుకోవటానికి అంత కష్టపడితే మీరు బాగుపడతారు. ఒకవేళ నీకు ఏదో కొంత సబ్జక్టు తెలిసినా గురువు సమక్షంలో నాకు తెలుసు, నేను చెప్పగలను అని ఎగిరి పడవద్దు. గురువును ఆశ్రయించి, వారిని సేవించి, వారి బోధను పొంది, వారి అనుగ్రహాన్ని పొంది, నువ్వు జ్ఞానసముపార్జన చెయ్యి, సూర్యుడు ఉదయిస్తేనేగాని చీకటి బయటకు వెళ్లదు. గురువు అనుగ్రహం లేకుండా మనలో ఉన్న అజ్ఞానం బయటకు పోదు. బాహ్య పరిస్థితులను చూసి వినయం పాడుచేసుకోవద్దు, గర్వాన్ని పెంచుకోవద్దు. గర్వం ఎప్పుడయితే వచ్చిందో ఆ మనిషికి పతనం ప్రారంభమవుతుంది. నా మాటయందు నీకు గౌరవం ఉంటే, నా ఇష్టాన్ని నీ ఇష్టం కింద చేసుకొంటే, నా రూపాన్ని ధ్యానం చేస్తూ ఉంటే, నా నామాన్ని స్మరిస్తూ ఉంటే ఎటువంటి బుద్ధిని ఇస్తే నీకు మోక్షం కలుగుతుందో అటువంటి బుద్ధిని ప్రసాదిస్తాను అంటున్నాడు పరమాత్మ. ఇది భగవంతుడు ఇచ్చిన హామీ, ఆ మాటకు ఇంక తిరుగులేదు. మీరు ఎవరికైనా ఏదైనా ఇచ్చేటప్పుడు కూడా ఆ ఇచ్చే విధానం కూడా ఉపనిషత్‌లలో ప్రతిపాదించబడింది. మీరు ఎవరికైనా మజ్జిగ పోస్తున్నారు అనుకోండి, ఏదో మనం పోసేస్తున్నాము అనుకోవద్దు. వారికి మజ్జిగ ఇస్తున్నాము, వారు తీసుకొంటారో, లేదో

అనే అనుమానంతో, ప్రేమతో, భక్తిగా ఇవ్వండి. అంతేగాని మేము మజ్జిగ ఇస్తున్నాము, మేము ఎక్కువ వారము, వారు తక్కువ వారు అని అటువంటి బేధ బుద్ధిని పెట్టుకోవద్దు. దానివలన మీకు చిత్తశుద్ధి రాదు. మీరు ఇచ్చేటప్పుడు వారు తీసుకొంటారో, లేదో అనే అనుమానంతో ఇవ్వాలి. ఆ తీసుకొనే వాడు అదే మొట్టమొదటి సారి చూస్తున్నంత ప్రేమగా తీసుకోవాలి. ఇచ్చేవారు అలా ఇవ్వాలి, తీసుకొనేవారు ఇలా తీసుకోవాలి. అంటే ఇవన్నీ మనం బాగుపడటానికి, మనకు గర్వం రాకుండా చూడటం కోసం మహర్షులు మనకు బోధించారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-02-06, ఉందుర్రు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడిని కొంతమంది విష్ణురూపంలో, కొంతమంది శివరూపంలో, కొంతమంది అమ్మ రూపంలో ఆరాధిస్తారు. అమ్మ దయ కూడా అవసరం. పార్వతి పరమేశ్వరులను సమానంగా పూజించాలి ఇందులో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అని అనుకోకూడదు. మనం ఇంటి దగ్గర కూడా తల్లితండ్రులను సమానంగా ప్రేమించాలి, గౌరవించాలి. మీ ఇంటికి ఎవరైనా బంధువులు వస్తే చిరాకులేకుండా మీ ఇంట్లో ఏది ఉంటే అది ప్రేమగా, ఇష్టంగా, గౌరవంగా పెట్టండి. పార్వతీ పరమేశ్వరులు చూడటానికి వేరుగా కనిపిస్తారు కాని మూలంలో ఒక్కటే. మీరు శివుడు గురించి ఎక్కువ చెపుతారు, అమ్మ గురించి ఎక్కువ చెప్పరు అని భగవాన్‌తో అంటే నేను శివుడి గురించి ఒక మాట చెపితే అది అమ్మవారికి వర్తిస్తుంది, అమ్మ గురించి ఒక మాట చెపితే అది శివుడికి వర్తిస్తుంది అని భగవాన్ చెప్పారు. వారు ఇద్దరు వేరు కాదు. మీరు బహుజాగ్రత్తగా సాధన చేసుకోవాలి. మరణించే రోజు దగ్గరకు వస్తోంది అని మర్చిపోకూడదు. అజాగ్రత్త, అవినయం పనికిరాదు. జీవితంలో మీకు అవమానాలు జరిగితే అవి మీకు పాఠాలు నేర్పుతాయి, సన్మానాలు జరిగితే అవి మీకు బాధ్యతలు పెంచుతాయి. ఇవి అన్నీ దేహప్రారబ్దమును బట్టి వస్తాయి. తిండి, నిద్ర తగుమాత్రంగా ఉండాలి, అతిగా ఉండకూడదు. పని మాత్రం శ్రద్ధగా చేసుకోవాలి. మనం పని తక్కువగా చేస్తున్నాము, ఎక్కువగా తింటున్నాము, ఎక్కువగా నిద్రపోతున్నాము, ఇది మంచిది కాదు. సమాజానికి మీరు ఏదైనా చేయగలిగితే చేయవచ్చు, చేసేది మాత్రం నిరాడంబరంగా చేయాలి. నిరాడంబరంగా పనిచేస్తే దేవుని అనుగ్రహానికి పాత్రులవుతాము. ప్రతీ శరీరానికి ప్రారబ్దం ఉంటుంది. పూర్వజన్మ కర్మఫలాన్ని బట్టి అదృష్టం, దురదృష్టం వస్తూ

ఉంటాయి. కొంతమందికి అనుకోకుండా ఎక్కువ కలిసివస్తుంది, కొంతమందికి ఎంత కష్టపడినా కలిసిరాదు. దానికి పూర్వజన్మలో ఏవో కారణాలు ఉంటాయి. పూర్వజన్మ కర్మ మంచిది అయితే నీకు బాగుపడే ఆలోచనలు వస్తాయి, పూర్వజన్మ కర్మ దోషకర్మ అయితే నీవు పాడైపోయే ఆలోచనలు వస్తాయి. ఇదంతా మన ఇంద్రియాలకు కనబడదు, మన మనస్సుకు అందదు.

మనం పగలు అశాంతిగా ఉంటున్నాము, రాత్రి నిద్రపోయినప్పడు మనం శాంతిగా ఉంటున్నాము. ఎందుచేతనంటే రాత్రి మనం నిద్రపోయినప్పడు అహంకారం మనలను వదిలేస్తోంది మరల ఉదయం మనకు మెలుకువరాగానే వచ్చి పట్టుకొంటోంది. పగలు మనం ఈ అహంకారాన్ని వదిలించుకోగలిగితే శాంతిగా, సుఖంగా ఉండవచ్చు. మీరు అందరూ బాగుపడాలి, బాగుపడటమేకాదు మిమ్మల్ని సుఖం, శాంతి వరించాలి. ప్రారబ్ధాన్ని బట్టి మిమ్మల్ని అదృష్టం వెంటాడుతున్నా, దురదృష్టం వెంటాడుతున్నా కూడా మీరు సుఖ సముద్రంలో, శాంతి సముద్రంలో ఉండాలి, ఈ ప్రవచనాల యొక్క ధ్యేయం అది. మన హృదయంలో నారాయణుడు ఉన్నాడు, అది దర్శించిన వారికి తెలుస్తుంది. మనం బలవంతం చేస్తే ఆయన తెలియబడడు. మన యోగ్యతనుబట్టి, అర్హతనుబట్టి, మన మంచితనాన్ని, పుణ్యబలాన్ని చూసి ఆయన మనకు తెలియబడతాడు, ఆరోజు దగ్గరలోనే వస్తుంది, మీరందరూ తరిస్తారు. మన శరీరాన్ని నిర్మలంగా ఉంచుకోవాలి. కొంతమంది ఎప్పడూ చిరాకుగా, అసహనంగా, కోపంగా, ద్వేషంగా ఉంటారు. మన ఇంట్లో కనిపించే అశాంతికి, లోకంలో కనిపించే అశాంతికి మన మనస్సులో ఉన్న ద్వేషం, అసూయ, అసహనం కారణం. గాలివాన వచ్చినప్పడు గాలి వేగంగా ఉండి మనలను బాధపెట్టవచ్చు, వరదలు వచ్చినప్పడు నదులు మనలను బాధపెట్టవచ్చు, సునామి వచ్చినప్పడు సముద్రం మనలను బాధపెట్టవచ్చు, భూకంపాలు వచ్చినప్పడు భూమి మనలను బాధపెట్టవచ్చు కాని రోజూ అవి మనలను బాధ పెట్టవు. ఇప్పడు ప్రకృతి సమానంగా ఉంది చూడండి మరి మనం ఎందుకు శాంతిగా ఉండలేకపోతున్నాము అంటే మన బుద్ధి మంచిది కాదు. మీలో మీరు మా బుద్ధి మంచిది అనుకొంటే సరిపోదు, ఆయన మోక్షాన్ని ఇవ్వడు, ఆయన అనుకొంటే మోక్షాన్ని ఇస్తాడు. మనం చేసే పనులు నిర్మలంగా ఉండాలి. మనం చేసే పనుల వలన పది మంది సుఖపడాలి. ఇతరులు మన పట్ల ఎలా ఉంటున్నారో అనవసరం. మనం ఇతరుల పట్ల మర్యాదగా ఉండాలి. ఇతరులు మన పట్ల అమర్యాదగా ఉంటే వారు ఏదోరోజు ఈశ్వరుడిచేత శిక్షింప

బడతారు. వారు శిక్షింపబడాలని మనం కోరుకొంటే అది మన బుద్ధిలో ఉన్న దోషం. తలంపు, మాట, చేత ఒకటిగా ఉంటే సరిపోదు. అవి నిర్మలంగా ఉండాలి, నిశ్చలంగా ఉండాలి, జ్ఞానపూరితంగా ఉండాలి, నిరహంకారం ఉండాలి, అప్పుడు మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీ సంసారంలో ఉన్న మనుషులు మంచివారు అనుకోండి, మిమ్మల్ని సుఖ పెడతారు, మీకు అనారోగ్యం వస్తే హాస్పిటల్‌కు తీసుకొని వెళతారు, మిమ్మల్ని బాగా చూస్తారు కాని మీకుమోక్షం ఇవ్వలేరు ఎందుచేతనంటే వారు జీవులు, జీవులు మీకు మోక్షాన్ని ఇవ్వలేరు.

మనం బాగుపడకపోవటానికి కారణం ఏమిటి అంటే మనకు దైవచింతన లేదు, ఆత్మచింతన లేదు, ఎంతసేపు విషయచింతన. విషయచింతన పెరిగేకొలది పునర్జన్మలు పెరిగిపోతాయి. నీవు భగవంతుడు చెప్పిన మాటను ప్రమాణంగా తీసుకో. ఒకవేళ ఎవరైనా భగవంతుడు చెప్పిన మాటను వినరు అనుకో నీవు కోపం తెచ్చుకొని పాడైపోవద్దు. వారి పని భగవంతుడు చూసుకొంటాడు. మన కుటుంబ సభ్యులు అయినా సరే వారు క్రమశిక్షణ తప్పితే మంచి మాటలు చెప్ప, వారు వినకపోయినా మన మార్గం మనం విడిచిపెట్టకూడదు. ఎవరికైనా మంచి మాటలు చెప్పేటప్పుడు మర్యాదగా వారి క్షేమం కోరి చెప్ప. వారు వినటం లేదు, వీరు వినటం లేదు అని నీవు గుండెపోటు తెచ్చుకోవద్దు. విన్నవారు వింటారు, లేకుంటే లేదు. అలాగని మంచిమాటలు చెప్పటం మానవద్దు. అవసరమైతే మంచిమాటలు చెప్పాలి, అలా చెప్పకపోవటం కూడా దోషమే వారు వినకపోతే మనకు సంబంధం లేదు. బంధువులు, స్నేహితులు, నీ కుటుంబసభ్యులు అంతా నీ పూర్వజన్మ కర్మను బట్టి సిద్ధమవుతారు. నీవు చిరాకు పడవద్దు, నీ డ్యూటీ ఏదో నీవు నిర్మలంగా చేసుకో. ప్రారబ్ధం అనుభవిస్తే పోతుంది. ఇవి అన్నీ సహించాలి, సహనం వలన హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. చాలామంది పని చేసేటప్పుడు విసుగుగా చేస్తారు, అలా చేయకూడదు. దేవుడు దగ్గర పూజ ఎలా చేస్తారో అంత ఇష్టంగా, అంత శ్రద్ధగా పనిచేయాలి. ఇతరులకు ఏదైనా పెట్టేటప్పుడు కూడా భగవంతుడికి నైవేద్యం పెట్టినట్లు పెట్టాలి. నీవు ఎండమావిని చూసి నీరు అనుకోవచ్చు కాని ఆ ఎండమావికి నీరు ఎలా ఉంటుందో తెలుసా, నీవు తాడును చూసి పాము అనుకోవచ్చు కాని ఆ తాడుకు పాము ఎలా ఉంటుందో తెలుసా. అలాగే నీవు ఆత్మను దేహం అనుకోవటం, మనస్సు అనుకోవటం, లోకం అనుకోవటం అటువంటిదే. ఆత్మకు దేహంతోగాని, మనస్సుతోగాని, లోకంతోగాని ఎట్టి సంబంధం లేదు, ఆత్మను తెలుసుకొన్నాక ఇది నీకు తెలుస్తుంది కాని ఇప్పుడు నీకు తెలియదు. మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు. మీ

పనులు శ్రద్ధగా చేసుకోండి, తరువాత గోవిందుడిని భజించుకోండి. 24 గంటలు మీ గొడవలు చక్కబెట్టుకొంటూ ఉంటే ఈ లోపు మీరు ముసలివారు అయిపోతారు, చనిపోతారు, మీకు మరణానంతర జీవితం సున్న, మీకు చీకటిలోకాలు మిగులుతాయి. కొంతమంది లోకం కోసం, గౌరవాలకోసం పనులు చేయరు. ఈ పని చేస్తే భగవంతుడు సంతోషిస్తాడు అంటేనే ఆ పని చేస్తారు లేకపోతే చేయరు, దీనిలో రాజీపడరు, వారికి మాత్రమే భగవంతుడి దయ కురుస్తుంది.

మనం మాట్లాడేమాట మృదువుగా, హితవుగా ఉండాలి. ఎదుటివారికి చెప్పేటప్పుడు ఏదో డిక్టేట్ చేస్తున్నట్లుగా కాకుండా వారిని ప్రేమించి చెపుతున్నట్లుగా ఆ మాటలు ఉంటే అవి వారి హృదయాన్ని తాకుతాయి. మాట దేవుడితో సమానము. కొంతమంది బాగు పడటానికి ఒక్కమాట సరిపోతుంది. ఈశ్వరుడి ప్రీతికోసం నీవు పని చేస్తూ ఉంటే అహంకారం తగ్గిపోతుంది. నిప్పలో నెయ్యి వేస్తే మంట పెరిగిపోతుంది అలాగే మనస్సును సంతృప్తి పరచేకొలది అది పెరిగిపోతుంది. మిమ్మల్ని మీరు పొగుడుకోవద్దు, ఇతరులను తిట్టవద్దు. మనలను మనం పొగుడుకున్నా, ఇతరులను దూషించినా మన బుద్ధిలో దోషాలు పెరిగిపోతాయి. చాలామందికి ఈ రెండు రోగాలు ఉంటాయి, ముందు వాటిలో నుండి బయటకురా. మీకు డబ్బు ఉంటే అనవసరంగా పాడుచేయకండి, అవసరమైన పనులకు ఉపయోగించండి, సమాజశ్రేయస్సు కోసం నిర్మలంగా పనిచేయండి. మనం సారాకు అలవాటుపడినట్లుగా గౌరవాలకు అలవాటుపడితే ఇక మంచిపనులు చేయలేము. నీరు లేనిచోట బోర్ తవ్వించరు. మీకు పేరు వస్తుంది అంటే నీరు ఉన్న చోట బోర్ తవ్విస్తారు. ఇవి అన్నీ పిచ్చి పనులు. ఇటువంటి పనులు చేస్తే నీకు ఈశ్వరుని దయ ఎలా కలుగుతుంది. వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ ఉంటే నీకు ప్రేమ తగ్గిపోతుంది, ద్వేషం పెరిగిపోతుంది. 12 సంవత్సరాలు మాట్లాడకుండా ఉంటే జ్ఞానం వస్తుందట కదా అని భగవాన్‌ను అడిగితే జ్ఞానంరాదు కాని మూగతనం వస్తుంది అని చెప్పారు. మన మీద మనకు విశ్వాసం ఉండాలి, ధైర్యం ఉండాలి. ధైర్యం లేకపోతే భౌతికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రాలేము. శ్వాస ఇవాళకాకపోతే రేపు పోతుంది. మన ఇంటి నిండా డాక్టర్లు ఉన్నా శ్వాస పోకుండా ఆపు చేయగలరా? అందుచేత శ్వాస మీద ఆధారపడవద్దు, విశ్వాసం మీద ఆధారపడు. లౌకికులు మాకు బ్యాంక్‌లో ఇంత డబ్బు ఉంది, మాకు ఇన్ని ఎకరాల పొలం ఉంది, మా చుట్టాల పని బాగుంది, మా కుటుంబం

బలంగా ఉంది అనుకొంటూ బతుకుతారు. భక్తులు భగవంతుడి మీద ఆధారపడి బతుకుతారు. తుండుగుడ్డ కట్టుకొన్న గాంధీగారితో తిరుగుతున్నావు ఏమిటి, ప్రాక్టీసు చేసి సంపాదించు కోవచ్చు కదా అని మా బంధువులు అనేవారు. గాంధీగారితో తిరిగిన మూలంగా నా మనస్సు బాగుపడింది లేకుంటే నా మనస్సు ఎలా బాగుపడుతుంది అన్నారు నెహ్రూగారు. ఆయనతో తిరగటం వలన లోపల బాగుపడ్డాను, బయట పదవి వచ్చింది. పదవి మాట వదిలేయండి, లోపల బాగుపడటం ముఖ్యం కదా అన్నారు. నీకు సొంత ఆలోచన ముఖ్యం, ధైర్యం అవసరం. గాంధీగారి కంటే తెలివైనవారు చాలామంది ఉన్నారు కాని ఆయనకు అంత పేరు రావటానికి ధైర్యం కారణం. ఒక మంచిపని కోసం ప్రాణాన్ని ఇవ్వటానికైనా ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారు.

మీకు ఐశ్వర్యం ఉంటే జాగ్రత్త పెట్టుకోండి, అంతేగాని ఈ ఐశ్వర్యం వలన నేను సుఖంగా ఉంటాను అని అనుకోవద్దు. మీ మనస్సులో మాత్రం ఈశ్వరుడి మీద ఆధారపడండి. ఈ రోజు పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాల మీద ఆధారపడవద్దు. మనస్సు చేతిలో మీరు ఉండకుండా, మీ చేతిలో మనస్సును పెట్టుకొంటే అప్పుడు మనస్సు మీకు స్వాధీనం అవుతుంది. స్వాధీనమైన మనస్సు మీకు మిత్రుడిలాగ పనిచేస్తుంది. మిత్రుడయిన మనస్సు మీకు జ్ఞానాన్ని సంపాదించిపెడుతుంది. శరీరం పుడుతుంది, పెరుగుతుంది, చనిపోతుంది. ఈ శరీరం పేరుమీద, మనస్సు పేరు మీద మీకు వచ్చేది అశాంతే. ఇప్పుడు మీరు అందరూ ఉన్నారు. మీ జీవితంలో శాంతికంటే అశాంతి ఎక్కువ అనుభవిస్తున్నారు, సుఖం కంటే దుఃఖం ఎక్కువ అనుభవిస్తున్నారు. అయితే గౌరవాలకు భంగం అని పైకి చెప్పకోరు. ఒక్క ఆత్మలో తప్పించి, చైతన్యంలో తప్పించి సుఖం ఎక్కడా లేదు. డబ్బు ఉంటే బజారులోని వస్తువులు కొనుక్కోవచ్చు కాని వైరాగ్యం లేకుండా మీకు సుఖంరాదు. వైరాగ్యం లేకపోతే మీరు ధైర్యంగా ఉండాలి అనుకొన్నా ధైర్యంగా ఉండలేరు. ఇతరులు మనకు మంచి చేయవచ్చు లేకపోతే చెడ్డచేయవచ్చు. మనం మంచిని గుర్తు ఉంచుకొని, చెడ్డను మర్చిపోతే మన మనస్సు అణిగిపోతుంది. చెడ్డను గుర్తు ఉంచుకొంటే రజోగుణం పెరిగిపోతుంది, దాని వలన మనకు రాబోయే జన్మలు పెరిగిపోతాయి. మనం మానవ శరీరంలో ఉన్నా, జంతు శరీరంలో ఉన్నా భగవంతుని నామాన్ని స్మరించుకొంటూ, ఆయన పాదాలను హృదయంలో పదిలపరచుకొంటే మనం తరిస్తాము. మనస్సు ఈశ్వరుని పాదాలమీద నిలబడినప్పుడు జంతుశరీరంలో ఉన్నా ఫరవాలేదు. మీ ఇల్లు మీద ఎక్కువ మమకారం పెట్టుకోవద్దు.

సంవత్సరానికి ఒకసారి 15 రోజులు ఇల్లు విడిచిపెట్టి దూరంగా వెళ్ళండి. అప్పుడు ఇంటి మీద ఎంత మమకారం ఉందో తెలుస్తుంది. దేనిమీద ఎక్కువ మమకారం పెట్టుకోవద్దు. మీరు ఎర్రబట్టలు వేసుకొన్నారా, తెల్లబట్టలు వేసుకొన్నారా అనేది ముఖ్యంకాదు. మీ మనస్సు భగవంతుడి పాదాలను పట్టుకొందా లేదా అనేది ముఖ్యం. నదిలోని నీరు సముద్రం వైపుకు ఎలా ప్రయాణిస్తుందో అలాగ మీ మనస్సు ఆత్మాభిముఖంగా ప్రయాణిస్తుందా అనేది జాగ్రత్తగా చూసుకోవాలి. బయట విషయాల గొడవ వద్దు మీ లోపల ఏమి జరుగుతోందో చూసుకోండి. మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే బెంగపెట్టుకొని రోజూ ఏడుస్తూ కూర్చోవద్దు, ఆ టైమును భగవంతుడిని తెలుసుకోవడానికి ఉపయోగిస్తే మీ ఇంట్లో ఎవరైతే చనిపోయారో వారికి మీ ద్వారా శాంతి అందుతుంది.

మనం ఒకరిని ఒకరు ప్రేమించుకోవటం తక్కువ అందుచేతనే ఇంట్లోను, బయట పేచీలు పెరిగిపోతున్నాయి. మీ పని ఏదో మీరు శ్రద్ధగా చేసుకోండి. జరిగేది ఏదో జరుగుతుంది, జరగనిది ఏదో జరుగదు. ఆసక్తి పెట్టుకోవద్దు. ఆసక్తి పెట్టుకోవటం వలన తొందరగా జరుగదు, ఆసక్తి పెట్టుకోకపోవటం వలన ఆలస్యంగా జరుగదు. అనాసక్తిగా ఉండండి. మనకు వైరాగ్యం లేక భగవంతుడు చెప్పిన మాటలు ఆముదంలాగ ఉంటాయి. అన్ని యోగాలను సమన్వయం చేసుకోండి. భక్తియోగం అంటే మన మనస్సు ఈశ్వరుడిని స్మరించటం, కర్మయోగం అంటే ఆసక్తి లేకుండా మన పని శ్రద్ధగా చేసుకోవటం. మనం సొంతంగా ఆలోచించుకోలేము. భగవంతుడి మాటలు నమ్మము ఇంక ఎలాగమరి. ఇప్పుడు నేను చెప్పే మాటలు ఎంతవరకు ఉపయోగపడతాయి, ఎంతవరకు ఉపయోగపడవు అనే వివేకం మీకు ఉంటే, మీరు సొంతంగా ఆలోచించుకొని ఉపయోగపడే మాటలను తీసుకొని ఆ మాటల ప్రకారం జీవిస్తే అవి మీకు సొంతం అవుతాయి. మన ప్రవర్తన సరిగా లేకపోవటం వలన, మన బుద్ధి నిదానంగా లేకపోవటం వలన మనలను మనం ఎలా ఉద్ధరించుకోవాలో మనకు తెలియటం లేదు. మన గురించి మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు అన్న సంగతి కూడా మనకు తెలియటంలేదు. భగవంతుడిని కాదని మనం ఏమీ చేయలేము. ప్రతీ చిన్న విషయానికి భయపడవద్దు. ఇష్టాయిష్టాలను తగ్గించుకోండి. భగవంతుని దయను సంపాదించుకోవటానికి, ఆయన ప్రేమను సంపాదించుకోవటానికి పనులు చేయండి. మీ ఇంటి దగ్గర ఉన్న డబ్బే భాగ్యం అనుకోకండి, సబ్జక్టును శ్రద్ధగా వినటం కూడా భాగ్యమే అది

మర్చిపోవద్దు. మీకు లోపల యోగ్యత లేకపోతే, అర్హత లేకపోతే కళ్ళు ఉన్నా చూడలేరు, చెవులు ఉన్నా వినలేరు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-03-06, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈశ్వరుడికి తెలియకుండా ఈ సృష్టిలో చిన్న సంఘటన కూడా జరగటానికి వీలు లేదు. అందుచేత మనం ఆయనకు శరణాగతి చేస్తే దుఃఖం నశిస్తుంది. బయట ఉన్న రాక్షసుల కంటే లోపల రాక్షసులను జయించటం కష్టం. బయట ఉన్న రాక్షసులను బాంబులు వేసి చంపేయవచ్చు కాని లోపల రాక్షసులను అలా చంపలేము. మన పునర్జన్మలకు కారణం లోపల ఉన్న రాక్షసులు. కోరిక, కోపం ఇవి లోపల ఉన్న రాక్షసులు. ఇవి రజోగుణంలో నుండి వస్తాయి. వీటిలో నుండి దుర్గుణాలు, దురాచారాలు, పునర్జన్మలు అన్నీ వస్తాయి. మనిషిలో రజోగుణం ఎంత కాలం అయితే ఉందో అంతకాలం ఇవి రెండూ వస్తూ ఉంటాయి. శరీరం కూడా నీడ ఉంటుంది దీనిని ఎవరూ ఆపు చేయలేరు. అలాగే మీలో అహంభావన ఉన్నంతకాలం, దేహ భావన ఉన్నంత కాలం మీరు ఎన్ని జన్మలు ఎత్తినా అశాంతి మీకూడా ఉంటుంది, మీ అడుగులో అడుగు వేసుకొంటూ మీ కూడా ఉంటుంది. దేహం కంటే ఇంద్రియాలు గొప్పవి, ఇంద్రియముల కంటే మనస్సు గొప్పది, మనస్సు కంటే బుద్ధి గొప్పది, బుద్ధి కంటే చైతన్యం గొప్పది అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఇవి అన్నీ ఒక దానికంటే ఒకటి లోతుగా ఉంటాయి. శరీరం కంటే ఇంద్రియాలు లోతుగా ఉంటాయి, వీటికంటే మనస్సు ఇంకా లోపల ఉంటుంది, మనస్సు కంటే బుద్ధి ఇంకా లోపల ఉంటుంది, బుద్ధి కంటే ఆత్మ ఇంకా లోపల ఉంటుంది. లోపలకు అంత దూరం వెళితేనేగాని ఆత్మ మనకు గోచరం కాదు. సత్వగుణం ప్రాక్టీసు చేయకుండా మనం లోపల ఉన్న రాక్షసులను జయించలేము. ఏదైనా సహజంగా రావాలి, కృత్రిమంగా వచ్చినది నిలబడదు. నేను ప్రయత్నం చేసి, ఎంతో కష్టపడి మీకు సబ్జక్టు చెపుతున్నాను అనుకోండి అంటే దాని తాలుక అనుభవం నాకు లేదు అని అర్థం. నేను చెప్పేమాట అప్రయత్నంగా, సహజంగా వస్తేనే నేను చెప్పగలను, మీరు వినగలరు, దాని వలన మీకు శాంతి కలుగుతుంది. నేను ఏదో కష్టపడిపోతున్నాను అనుకొంటే మీకు శాంతి రాదు, నాకు కష్టం మిగులుతుంది.

అజ్ఞానాన్ని విడిచిపెట్టేస్తే జ్ఞానం ఎలా ఉంటుందో మీకు తెలుస్తుంది, జడాన్ని

విడిచిపెట్టేస్తే చైతన్యం ఎలా ఉంటుందో మీకు తెలుస్తుంది, అనాత్మను విడిచిపెట్టేస్తే ఆత్మ గురించి మీకు తెలుస్తుంది, దానిని విడిచిపెట్టకుండా ఇది తెలియదు కదా అంటున్నారు భగవాన్. మనం అనాత్మను విడిచిపెట్టలేకపోతున్నాము. నీవు ఎంతకాలం అయితే మనో దేహముల నుండి బయటకు రాలేవో అంతకాలం చైతన్యస్థాయిని పొందలేవు. ఇలా జన్మిస్తూనే ఉంటావు, మరణిస్తూనే ఉంటావు, ఇదే సంసారం. నేను ఉన్నాను, అది చైతన్యం. నేను అలాగ ఉన్నాను, నేను ఇలాగ ఉన్నాను, నేను తక్కువగా ఉన్నాను, నేను ఎక్కువగా ఉన్నాను అనుకోవటం అనాత్మ, అది అసత్యం. ఇలా మనం కాని దానితో తాదాత్మ్యం పొందుతున్నంత కాలం మనం అసత్యంలో వున్నంతకాలం ఎంతటి వారికైనా పునర్జన్మలు తప్పవు. దేహము నేను అనే తలంపులోనుండి బయట పడనంతకాలం ఏ మనిషి కూడా అశాంతిలో నుండి బయటపడలేడు. మనస్సును కోరిక, కోపంలోనుండి విడిపించాలి. ఎప్పుడయితే మనస్సును వాటిలో నుండి విడిపించామో అంతకంటే లోతులలో ఉన్న చైతన్యంలో ఐక్యమవుతుంది. ఇంద్రియ నిగ్రహం లేకుండా, మనో నిగ్రహం లేకుండా మనస్సుకు లోచూపురాదు. భగవంతుడు ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాడు, ఈ ప్రపంచం ఎందుకు గోచరిస్తోంది అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాడు అని నీ లోపల ఒకడు ఉండి అడుగుతున్నాడు కదా, వాడిని తెలుసుకోవటానికే ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. అంటే నన్ను నేను తెలుసుకోవాలి కదా అన్నాడు. ఏ నేను అయితే నన్ను నేను తెలుసుకోవాలి అని అంటోందో ఆ నేననే అడుగు, నిన్ను నీవు తెలుసుకో అని దానినే అడుగు నన్ను అడుగుతావు ఏమిటి అంటున్నారు భగవాన్. ఒక్క చైతన్యం తప్పించి అంతా కల్పితమే. ఈ కల్పితాన్ని ఎంతకాలం అయితే విడిచి పెట్టమో అంత వరకు సత్వగుణం నీకు స్వాభావికంగా రాదు. మనకు లోపల సత్వగుణం ఉండదు, సత్వగుణం ఉన్నట్లు నటిస్తాము. ఇలా నటించటం వలన లోకాన్ని మోసం చేయగలము కాని భగవంతుడిని మోసం చేయలేము. సత్వగుణం స్వాభావికంగా ఉండాలి, అప్పుడు అది సహజం అవుతుంది, అప్పుడు నీవు కోపంలో నుండి, కోరికలో నుండి విడుదల పొందుతావు అని పరమాత్మ చెపుతున్నాడు. రాముడు అద్దంలాంటివాడు అన్నాడు వాల్మీకి. మనం రోజూ స్నానం చేసిన తరువాత అద్దంలో చూసుకొంటాము. మొఖం బాగుందా? లేదా? అని చూసుకొంటాము, ఏవైనా మరకలు ఉంటే తుడిచేసుకొంటాము, పౌడర్ వ్రాసుకొంటాము. ఇక్కడ వాల్మీకి ఏమి చెపుతున్నాడు అంటే రాముడనే అద్దంలో నిన్ను నీవు చూసుకో అంటున్నాడు. రాముడి గుణాలు నీ గుణాలు

సరిపోతున్నాయా? లేదా? అని చూసుకో. రాముడి గుణాలకు, నీ గుణాలకు తేడా ఉంటే నీ గుణాలను తొలగించుకొని రాముడి గుణాలను అలవర్చుకో, అప్పుడు ఆయన స్వరూపం నీకు దొరుకుతుంది, అదే మోక్షం అని వాల్మీకి చెపుతున్నాడు.

నేను ఏదైనా మాట మాట్లాడిన తరువాత నాకు ఆందోళన వస్తోంది అనుకోండి, శరీరంతో ఏదో పని చేసిన తరువాత నాకు అశాంతి వస్తోంది అనుకోండి, మనస్సులో ఏదో ఆలోచన వచ్చి వెళ్ళిపోయిన తరువాత నాకు అశాంతి వస్తోంది అనుకోండి, నాకు సత్వగుణం లేదు అని అర్థం. నేను ఏదైనా మంచి పని చేసినా అది నన్ను ఉద్రేక పరచకూడదు. అశాంతి, ఉద్రేకం వస్తూ ఉంటే పైకి మంచి పనిగా కనిపించినా అది నన్ను బాగు చేయలేదు. నా మాట, చేత, తలంపు నన్ను ఉద్రేకపరచకూడదు. అలా ఉద్రేకపరుస్తూ ఉంటే అవి రజోగుణాన్ని పెంచేస్తాయి. రజోగుణం పెరిగిపోతూ ఉంటే నీవు కోరిక, కోపంల నుండి బయటకు రాలేవు అని పరమాత్మ చెపుతున్నాడు. మీకు అనేకమంది బంధవులు, స్నేహితులు ఉన్నప్పటికీ, అర్థబలం అంగబలం ఉన్నప్పటికి, వాతావరణ పరిస్థితులు కలిసివస్తున్నప్పటికీ, మీరు ఏ పని చేసినా కలిసివస్తున్నప్పటికీ, మీ ఇంద్రియాలు మనస్సు మీ అదుపులో ఉన్నప్పడు అది తీసుకొని వచ్చే సుఖాన్ని, శాంతిని మీ బంధువులుగాని, స్నేహితులు గాని, పరిస్థితులు గాని తీసుకొని రాలేవు. ఎవరి దేహం వారిది, ఎవరి మనస్సు వారిది, ఎవరి గుణం వారిది, ఇది అంతా మాయ. మీ శరీరంతో ఘనకార్యాలు చేయవచ్చు, మీ మనస్సులోకి గొప్పగొప్ప ఆలోచనలు రావచ్చు, ఇవి అన్నీ కాల ప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. అందరి హృదయాలలో ఉన్న సత్యాన్ని ఎవడైతే దర్శించాడో వాడే సుఖాన్ని, శాంతిని పొందుతాడు, వాడే నిజమైన సుఖి, అదే నిజమైన దర్శనం. మిగతావి ఏమి సాధించినా అన్నీ కాల ప్రవాహంలో కొట్టుకొని పోతాయి. మీరు పెద్ద కాలేజీ కట్టించవచ్చు. ఈ దేహం ఎంత నిజమో, లోకం ఎంత నిజమో, మనస్సు ఎంత నిజమో అది కూడా అంతే నిజం. దాని వలన పుణ్యం వస్తుంది. పుణ్యం అయినా, పాపం అయినా ఒక కాలంలో చేస్తాము, ఇంకో కాలంలో అనుభవిస్తాము, అన్ని కాల ప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. చైతన్యం సరళమైనది, నిశ్చలమైనది, శుద్ధమైనది, నీ మొఖాన్ని అటు తిప్పు అంటున్నాడు పరమాత్మ.

మనం ఎవరి పట్ల అసూయ పడకూడదు. ఎందుచేతనంటే మనకు ఎవరిపట్ల అసూయ వచ్చినా మనస్సుకు లోచూపు కలుగదు. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలంటే మనకు అసూయ రాకూడదు. మనం అసూయతో ఉంటే బతికున్నంతకాలం

అశాంతి, చనిపోయిన తరువాత పాడు లోకాలు. దానాలలో కర్ణుడికి ఉన్నంత పేరు పాండవులకు, కౌరవులకు లేదు. ధుర్యోధనుడికి కర్ణుడికి బాగా స్నేహం. అటువంటి ధుర్యోధనుడికి కర్ణుడు మీద అసూయ వచ్చింది. ఎవరైనా దానం కోసం వస్తే నా దగ్గరకు పంపండి కర్ణుడి దగ్గరకు పంపవద్దు అని చెప్పాడు. ఎవరో ఒకరు వస్తున్నారు ధుర్యోధనుడు వారికి అడిగినది ఇచ్చి పంపుతున్నాడు. ఇంతలో వర్షకాలం వచ్చింది. ఒక బ్రాహ్మణుడు వచ్చి నేను యజ్ఞాలు, యాగాలు చేయటానికి అలవాటుపడ్డాను, పొడిపుల్లలు కావాలి అని అడిగాడు. బాగా వర్షాల వలన పుల్లలు తడిసిపోయాయి, మీకు పొడి పుల్లలు ఇవ్వలేను అని ధుర్యోధనుడు చెప్పాడు. ఆ బ్రాహ్మణుడు కర్ణుడి దగ్గరకు వెళ్ళి అడిగాడు. కర్ణుడి దగ్గర ఉన్న పుల్లలు కూడా తడిసిపోయి ఉన్నాయి. నేర్చుకొన్నదానికి, స్వాభావికంగా వచ్చిన దానికి తేడా ఇక్కడ చూడండి. కర్ణుడు ఏమి చెప్పాడు అంటే మనం ఉన్న ఇల్లు విప్పేసి లోపల ఉన్న దూలాలు ఇవ్వండి, వారు యజ్ఞం చేసుకొంటారు అని చెప్పాడు. ఆ వార్త ధుర్యోధనుడికి తెలిసింది. అప్పుడు వాడు కళ్ళు తెరిచాడు. ఇది నాకు తట్టలేదు. ఇవ్వటం అనేది నీకే సాధ్యం, నాకు సాధ్యం కాదు. నిన్ను చూసి నేను అసూయ పడ్డాను. నీవు నీవే, నేను నేనే అన్నాడు ధుర్యోధనుడు. నీకు సహజమైనది కాబట్టి అది నీకు స్ఫురించింది. నాది కృత్రిమం అందుచేత నాకు స్ఫురించలేదు. ఆ గుణానికి సంబంధించినంత వరకు నీ ఔన్నత్యానికి నేను సరిపోను. కర్ణుడిని చూసి ధుర్యోధనుడికి అసూయ వచ్చింది అంటే ఎవరూ నమ్మరు ఎందుచేతనంటే వారు స్నేహితులు. ఇది మీకు ఎందుకు చెపుతున్నాను అంటే ఆధ్యాత్మిక సాధనలో బహుజాగ్రత్తగా ఉండాలి. మాకు కోరికలు లేవు అనుకొంటారు కాని ఎక్కడో లోపల సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటుంది. గురువు నీ లోపల ఉన్న వికారములను, మాయను, అజ్ఞానాన్ని అన్నింటిని కక్కిస్తాడు అప్పుడు గాని గురువు ఏ స్థానంలో ఉన్నాడో ఆ స్థానాన్ని నీవు పొందలేనని గురువుకు తెలుసు. లోపల వాసనలు, వికారాలు ఉన్నప్పుడు నీవు జన్మలు రాకుండా ఆపుచేసుకోలేవు. చిన్న తనంలో అమాయకంగా రోజులు వెళ్ళి పోతాయి, వయస్సులో ఉండగా కోపతాపాలతో రోజులు వెళ్ళిపోతాయి, ముసలితనం వచ్చాక జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ ఏడుస్తూ కూర్చొంటాము. వయస్సులో ఉండగా సాధన చేయలేనప్పుడు, కోరిక, కోపంలో నుండి బయటకు రాలేనప్పడు, ముసలితనం వచ్చాక వల్లకాటికి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నప్పడు సాధన చేసి తరిస్తావా? వయస్సులో ఉండగా నీ శరీరాన్ని కోపతాపాలకు అప్పగించి, మంచం పట్టాక నీ శరీరాన్ని నాకు ఇస్తావా? పండు కుళ్ళిపోయిన తరువాత

తినమంటావా అంటున్నాడు పరమాత్మ. భీష్ముడు బలంలో గొప్పవాడు, హృదయంలో గొప్పవాడు, ఏది ధర్మం ఏది అధర్మం అని ఆయనకు తెలుసు. ఇన్ని తెలిసికూడా ధుర్యోధనుడికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఇలా తయారయ్యాను అంటాడు. అది తలరాత. అందుచేతనే పెద్దలు ఏమని చెపుతారు అంటే కర్మను బట్టి చుట్టాలు దొరుకుతారు. తీరా పుట్టేసాము కదా చుట్టాలను మార్చుకోలేము. వారు చెడ్డవారు అయినా మంచివారు అయినా అది రాత. మీరు కొంచెం జాగ్రత్తగా వివేకంతో స్నేహితులను ఎంచుకోండి అని చెపుతారు. ఇప్పడు నీవు దేహంతోటి, మనస్సుతోటి ఎలా ఏకంగా ఉంటున్నావో అలాగ చైతన్యంతోటి ఏకం అయ్యేవరకు పుట్టినవాడు చనిపోతాడు, చనిపోయిన వాడు తిరిగి పుడతాడు, నీకు ఇదే పని, గురువు దయ లేకుండా ఈ చక్రంలో నుండి బయటకు రాలేవు. గణపతిశాస్త్రిగారు భగవాన్‌ను అన్నారు నీవు కూరలు బాగా వండుతున్నావు. ఇంకో వంట కూడా నేర్చుకొన్నావు, దాని వలన మాకు ప్రమాదం వస్తోంది. నిన్ను చూడటానికి చాలా మంది వస్తున్నారు, నీవు పైకి అమాయకుడిలాగ కనిపిస్తున్నావు, మామూలుగా వారితో మాట్లాడుతున్నావు, ఏమి చేస్తున్నారు, భోజనం చేసారా, ఎప్పడు వచ్చారు అంటావు, ఏదో మాట్లాడతావు. వారికి తెలియకుండా వారి అహంకారాన్ని ముక్కలుగా కోసి, దాకలో ఉడకేసి, ఆ కూరలతో అరుణాచలేశ్వరుడి అన్నం పెడుతున్నావు. ఇది నీవు చేసే పని రమణేశ్వరా. నీవు వండే బయట కూరలు మాకు కనిపిస్తున్నాయి కాని ఎంతమంది అహంకారాలను కోసి, కూరలుగావండి అరుణాచలేశ్వరుడికి భుజింపచేస్తున్నావో ఇది మాత్రం చాలామంది కళ్ళకు కనబడటంలేదు అన్నారు.

మనం ఏదైతే నేను, నేను అని అంటున్నామో అదే సత్యం, అది సహజం అనుకొంటున్నాము. అది సత్యంకాదు అని ముందు మనకు ఫండమెంటల్‌గా అర్థమయితే తరువాత దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేసుకోవచ్చు. దేహము నేను అనే చిన్న తలంపులో ఇంత గందరగోళం, ఇంత అల్లరి ఉందా, పుణ్యాలు పాపాలు, అదృష్టం దురదృష్టం, జననాలు మరణాలు, కర్మలు ఇన్ని గొడవలు, ఇన్ని కొమ్మలు, ఇన్ని శాఖలు ఉన్నాయా అని భగవాన్‌తో ఒక పండితుడు అన్నాడు. మఱ్ఱి విత్తనం ఎంత చిన్నది, అంత చిన్న విత్తనంలో ఇంత పెద్ద చెట్టు, ఆకులు, కొమ్మలు ఉన్నాయి అలాగే దేహము నేను అనే తలంపులో ఇంత అల్లరి ఉంది అన్నారు భగవాన్. కాని ఆ తలంపు అసత్యం. ఆ తలంపును సంతృప్తిపరచు కోవటానికి జీవితం పొడుగునా ప్రయత్నిస్తాము, అదే మాయ. నా పాదాలను ఆశ్రయించ

కుండా, నేను చెప్పిన మాటలు వినకుండా, నేను చెప్పిన మాటలు అర్థం చేసుకొని జీర్ణం చేసుకోకుండా ఈ మాయలో నుండి బయటకు రాలేవు, ఆత్మను పొందలేవు అని పరమాత్మ చెపుతున్నాడు. ఈ దొంగనేను భగవంతుడు చెప్పిన మాటలను నమ్మనివ్వదు. ఎందుచేత నంటే అది కృత్రిమమైనది, అసహజమైనది. అందుచేత సహజమైన దానిని అది ఎలా నమ్ముతుంది. చాలామంది సాధకులు చేసే పొరపాటు ఏమిటి అంటే జరిగిపోయిన గొడవలు తలచుకొని దుఃఖపడతారు, భవిష్యత్‌లో మన జీవితం ఎలాఉంటుంది అని ఊహించుకొంటూ వర్తమాన కాలాన్ని వదిలేస్తారు. ఇది అంతా అనవసరం. ఈ జన్మ ఎందుకు వచ్చింది, ఏ కారణం వలన వచ్చింది అని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అంతేగాని రాబోయే జన్మలు ఎటువంటివి వస్తాయి అని ఊహించకు, అది మనస్సు చేసే మాయ. ఈ జన్మ ఎంత అసత్యమో రాబోయే జన్మలు కూడా అంతే అసత్యం. బాహ్యపరిస్థితులు అనుకూలంగా ఉంటే పొంగిపోకుండా, ప్రతికూలంగా ఉంటే కుంగిపోకుండా నీ హృదయంలో ఉన్న ఈశ్వర సామ్రాజ్యాన్ని వెతకండి, అందులో ప్రవేశించండి. మీకు ఎప్పుడు, ఏమి కావాలో అన్నీ ఈశ్వరుడే చూసుకొంటాడు, ప్రత్యేకంగా నీ ప్రయత్నం ఏమీ అక్కరలేదు. ఏ సంస్కారమువలన, ఏ కారణం వలన ఈ శరీరం వచ్చిందో ఆ సంస్కారములను తొలగించుకోవటం మానివేసి, ఆ కారణాలను కాల్చి బూడిద చేయటం మానేసి మరల శరీరం ఎటువంటిది వస్తుంది, జన్మ ఎటువంటిది వస్తుంది అనే గొడవ ఎందుకు. ఏ సంస్కారముల వలన ఈ శరీరం వచ్చిందో మరల అవే కొత్త శరీరాన్ని తీసుకొని వస్తాయి. సత్వగుణం ఉంటే సరిపోతుందా, సత్వగుణం నేర్చుకొంటే సరిపోతుందా, అది స్వాభావికం అవ్వాలి కదా. కర్ణుడికి దాన గుణం ఎలా సహజంగా ఉందో అలాగ సత్వగుణం నీకు సహజం అవ్వాలి, స్వాభావికం అవ్వాలి. రెండు చిలుకలు ఉన్నాయి, అవి అక్క చెల్లెళ్ళు, అందులో ఒక చిలుకను దొంగోడు పట్టుకొని వెళ్ళాడు, ఒక చిలుకను ఋషి పట్టుకొని వెళ్ళాడు. ఒక రాజుగారు వేటకు వెళ్ళి దొంగోడు పట్టుకొని వెళ్ళిన చిలుక ఉన్న చోటుకు వచ్చాడు. దొంగ లోపలే ఉన్నాడు, చిలుక బయట ఉంది. వచ్చాడు, పట్టుకోండి, తన్నండి అంటోంది ఆ చిలుక. తరువాత రాజుగారు ఋషి ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ చిలుక దయచేయండి, కూర్చోండి, మా స్వామి వస్తారు అని మర్యాద చేస్తుంది. ఇవి అన్నీ సహవాస దోషాలు, మనుషులు కూడా అంతే. స్నేహాలనుబట్టి అభివృద్ధి లోనికి వస్తారు, స్నేహాలను బట్టి పాడైపోతారు. స్నేహాలు మంచివి అయితే చెడ్డవారు మంచి వారు అవుతారు. స్నేహాలు మంచివి కాకపోతే మంచివారు చెడ్డవారు అవుతారు. వివేకాన్ని,

వైరాగ్యాన్ని పెంచుకో, రాబోయే జన్మల గురించి ఆలోచిస్తూ కూర్చోవద్దు. ఒకవేళ జన్మలు వచ్చినా అవి అసత్యమే. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. కాలాన్ని పాడుచేసుకోవద్దు. నీ ప్రారబ్దకర్మను బట్టి చాలా జన్మలు వచ్చే యోగం ఉంది అనుకో, ఎంతగడ్డిమేటు అయినా చిన్న అగ్గిపుల్ల గీస్తే దగ్ధం అయిపోతుంది. అలాగే ఆత్మజ్ఞానం మొత్తం నీ ప్రారబద్ధ కర్మను దగ్ధం చేస్తుంది, అట్టిది జ్ఞానం.

అహంభావన ఉన్నంతకాలం మనిషి కూడా నీడ వచ్చినట్లు మనకూడా అశాంతి వస్తుంది. మనం పది పైసలు సేవ చేస్తాము, తొంబై పైసలు పబ్లిసిటీ కోరుకొంటాము. నీవు చేసే సేవ వలన వచ్చే పుణ్యం చాలా తక్కువ, కాని పబ్లిసిటీ కోరుకోవటం వలన అహంభావన పెరిగిపోతుంది, జీవుడు నరకానికి ప్రయాణం చేస్తాడు. రాజకీయ నాయకులు ఓట్ల కోసం పబ్లిసిటీ చేసుకొంటారు, భక్తులకు పబ్లిసిటీ గొడవ ఎందుకు? నెగ్గక ముందు మీకు సేవ చేస్తాము అని పదిసార్లు మన దగ్గరకు వస్తారు, నెగ్గిన తరువాత మన మీద యజమాని అనుకొంటారు, ఇదే మాయ. ఎవరైనా మంత్రి అయ్యారు అనుకోండి, నాకు అధికారం వచ్చేసింది, నేను గొప్పవాడిని అయిపోయాను అని పైకి అనకపోయినా, లోపల అనుకొంటాడు. రాముడిని రాజుగా నిర్ణయించాము, పట్టాభిషేకం చేస్తాను అని దశరథ మహారాజు కౌసల్యతో అంటాడు. నేను రాజును అవుతున్నాను అని రాముడు అనలేదు. రేపటి నుండి నా కర్తవ్యం నిర్వర్తించాలి అని తల్లితో రాముడు అంటాడు. కర్తవ్యం అంటే అధికారం అనుకొంటున్నాము. కర్తవ్యం వేరు, అధికారం వేరు. చనిపోవటం, పుట్టటం నూటికి నూరుపాళ్ళు దేహానికి సంబంధించినది. శరీరం యొక్క చావు పుట్టుకలను, మనస్సులో వచ్చే బెంగలను చైతన్యం మీద ఆరోపించుకొంటున్నావు. ఎంతకాలం అయితే శరీరంతో ఏకమై ఉంటావో అంతకాలం, నీవు చావులేని సత్య వస్తువు అయినప్పటికీ నేను చనిపోతున్నాను, నేను పుడుతున్నాను అని అనుకొంటూనే ఉంటావు. దేహభావన ఉన్నంతవరకు చావు పుట్టుకలు తప్పవు. దేహము నేను అనుకొనే వాడే నరకాసురుడు, వాడే రాక్షసుడు, వాడిని శిలువ వెయ్యి. నేను ఉన్నాను అది ఒక్కటే సత్యం. నేను అలా ఉన్నాను, నేను ఇలా ఉన్నాను అనుకొనేది నూటికి నూరు పాళ్ళు అసత్యం, అది మాయ యొక్క వికారం, దాని వలన అహంభావన పెరుగుతుంది. మీరు ఇంటి దగ్గర కూర్చుని నేను చనిపోతున్నాను అంటే మీ మాటలను నేను అంగీకరించను. ఆ తలంపును పోగొట్టటమే నా ఉద్దేశ్యం. ఆ తలంపును వేరుతో సహా నశింపచేయటమే నా బోధ యొక్క గమ్యం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 06-04-06 | గురు | పాలకోడేరు, రామాలయం |
| 09-04-06 | ఆది | పిప్పర |
| 12-04-06 | బుధ | భీమవరం, మధ్యాహ్నం గం॥ 3-00లకు |
| 19-04-06 | బుధ | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |
| 28-04-06 | శుక్ర | విజయవాడ |
| 11-05-06 | గురు | భీమవరం |
| 17-05-06 | బుధ | గుమ్మలూరు |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# అహంకారము – ఆత్మ

అనంతము, అద్వితీయము, శుద్ధ చైతన్యమూ అయిన బ్రహ్మములో 'నేను' అనుకొనే వ్యక్తిభావన సముద్రములోని ఒక నీటి బుడగలాంటిది మాత్రమే! నేను అనే తొలితలంపు అఖండాద్వైతస్థితి నుండి భావనాపరంగా వ్యక్తిని వేరు చేస్తుంది. అహంకారము నీటిబుడగ అయితే, 'నిజమైన-నేను' అనగా 'ఆత్మ' మహా సముద్రము లాంటిది. వ్యక్తి తాను ఆత్మకన్న భిన్నుడనని భావించడం, సముద్రములోని నీటి బుడగ తాను సముద్రముకన్న వేరుగా ఉన్నట్లు భావించడం లాంటిదే! నీటి బుడగకు ఉనికి సముద్రములోనే, సముద్రముగానే తప్ప దానికి భిన్నముగా లేదు. నీటి బుడగను విచారణ చేస్తే ఆ స్థానంలో సముద్రమే అనగా నీరే దర్శనమిస్తుంది. అట్లే అహంభావనను విచారణ చేస్తే దాని మూలములో అది నశించి పూర్ణమైన బ్రహ్మమే తాను అవుతుంది. అహంభావనకు ఆత్మకన్న భిన్నముగా ఉనికియే లేదు. అహంకారము ఆత్మకన్న భిన్నుడనని భావించుటయే అజ్ఞానము. అట్టి వేరు భావనయే దుఃఖమునకు, జన్మ పరంపరకు కారణమవుతుంది. అహంకారము సత్యము కాదు కాబట్టి, భ్రాంతి జన్యము కాబట్టి దానిని విచారణ చేస్తే అది వేదను సత్యము. తెలిసి ఆస్థానములో బ్రహ్మమే మిగులుతుంది. అహంకారము తన మూలమైన శుద్ధచైతన్యంలో తన ఉనికిని కోల్పోవడమే సాధన గమ్యం.

**- చావలి సూర్యనారాయణమూర్తి**

**టీచర్, అమలాపురం**

# శరీరాన్ని ఆడించేది వాసనలే

సంచిత కర్మను ప్రారబ్ద కర్మగా అనుభవించే పరికరమే మనస్సు. మమకారంతో కూడిన అభిమానాలనే, పాశమని, వాసనలు అని, మనస్సు అని అంటారు. మసక చీకటిలో తాడును పామని భ్రమించటానికి కారణం చీకటే. అలాగే లేని దాని మీద సద్భావన కల్పించటం మనస్సు స్వభావం. కారణం అదే మాయ కాబట్టి. మనస్సు గురించి తెలుసుకోవలసిన అవశ్యకత ఎంతో ఉంది. తన స్వభావం ఏమిటో తెలియనియ్యకుండా చాకచక్యంగా తప్పించుకొని తన మనుగడకు తగ్గట్లుగా మనలను నడిపించుకొంటుంది. శరీరమే రథం. ఇంద్రియాలే గుఱ్ఱాలు, బుద్ధే సారథి. వాసనలు బలంగా ఉంటే బుద్ధి అయిన సారథి గుడ్డివాడై రథం గోతిలో పడుతుంది. మనం దుమ్ములో పొర్లాడి ఏడుపులతో ఉంటాము. వేమన "లెక్కలేని ఆశ లీలమై యుండగా, తిక్క పట్టి నరుడు తిరుగు గాక, కుక్క వంటి మనస్సు కూర్చోనిచ్చునా" అన్నారు. మనం వివేక వైరాగ్యాలకోసం శ్రద్ధగా ప్రయత్నం చేస్తే భ్రమలు తొలగిపోతాయి. వాసనలు ప్రకోపించినప్పడు క్రోధంతోను, కామంతోనూ శరీరం ఊగిపోతుంది. సామాన్యుని ఇంద్రియాలు తన చుట్టూ ఉండే విషయాల సమాచారాన్ని సేకరించి మనస్సుకు అందిస్తూ వార్తాహరునిలా, బానిసలా పనిచేస్తూ ఉంటాయి. దానితో వాసనల చేతిలో శరీరం బంధీగా ఉంటుంది. జ్ఞాని ఇంద్రియాలతో చూస్తూ ఉన్నా ఏ సంక్షోభం లోనూ చిక్కుకోడు. కారణం అతని మనస్సు చైతన్య సాగరంలో ఆనందంగా ఉంటుంది. మదపుటేనుగు యొక్క గండ స్థలమును చీల్చటం సులభమే కాని వాసనలను నిగ్రహించటం కష్టం. ఆలోచనలు నశించటమే ముక్తి ఆలోచనా ప్రవాహంలో కొట్టుకుపోవటమే బంధం. శ్రీ నాన్నగారు "నీ వాసనలు అనే బండ రాళ్ళను నీ స్వప్రయత్నంతో నీవు తొలగించుకోలేవు. నీవు ప్రయత్నం చెయ్యటమంటే మదపుటేనుగుతో దోమ పోరాటం లాంటిది. (అంటే ఎన్నో జన్మల నుంచి పోగుచేసుకొన్నది అని) దానికి సింహంలాంటి గురువు చూపుతో ఆ ఏనుగు గడగడలాడి మరణిస్తుంది" అన్నారు. "ఇంద్రియాల ద్వారా పొందే సుఖమంతా దుఃఖమే, పాపమే పరాధీనతే" అన్నారు మహావీరుడు. కాబట్టి ప్రకృతి వస్తువులను వాసనలతో కాకుండా దైవనేత్రంతో దర్శించటమే నిజమైన విద్య అని గ్రహించి ఆచరించాలి, సుఖించాలి.

– **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం